
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శుక్రవారం 6 జూన్ 2025



అనుకున్నదే జరిగింది!

'ఇరిగేషన్'లో రచ్చకెక్కిన ఎల్‌వోసీ యవ్వారం

అనుకున్నదే జరిగింది. ఇరిగేషన్ శాఖలో తలెత్తిన ఎల్‌వోసీ (బడ్జెట్ కేటాయింపు) వివాదం రచ్చకెక్కింది. ఇప్పటివరకూ అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య జరిగిన యవ్వారం ఇప్పుడు హైకోర్టు మెట్లు ఎక్కింది. కాజ్‌వే కాంట్రాక్టర్‌కు మొత్తం ఎల్‌వోసీని కేటాయిస్తూ చీఫ్ ఇంజనీర్ ఉత్తర్వులను మార్చగా, దీనిపై అవతలి కాంట్రాక్టర్ కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ కేసు తేలే వరకూ ఎవరికీ బిల్లు విడుదలయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం బిల్లులు మంజూరుకు ఎల్‌వోసీ ఇచ్చినా దానిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం సక్రమంగా జరగలేదు.

8



కొవిడ్ కలకలం

ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ ● ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో వెలుగులోకి.. ● అందరూ ఐసోలేషన్‌లోనే..

నెల్లూరు (వైద్యం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మహమ్మారి కొవిడ్ కలకలం రేపింది. జిల్లాలో ఒకేసారి ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యవర్గాలను కలవరపాటుకు గురిచేసింది. బాధితుల్లో ఒకరిది తిరుపతి జిల్లాకు చెందిన గూడూరు. మిగిలిన ఐదుగురు జిల్లావాసులే. నెల్లూరు నగరంలోని ఇద్దరు నర్సింగ్ విద్యార్థులు కొవిడ్ బారిన పడ్డారు. వీరిలో ఓ విద్యార్థిని రెండు రోజుల క్రితం కేరళ నుంచి నెల్లూరుకు వచ్చింది. అలాగే భక్తవత్సలనగర్‌కు చెందిన 60 ఏళ్ల వ్యక్తికి కూడా కరోనా సోకినట్లు అధికారులు గుర్తించారు. వెంకటాచలం మండలం అనికేపల్లికి చెందిన ఓ యువకుడు, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన మరో యువకుడూ కరోనా బారిన పడినట్లు అధికారులు గుర్తించారు. కరోనా అనుమానంతో ఈ ఆరుగురు వైద్యాధికారులను కలవగా రెండు రోజుల క్రితం కరోనా ర్యాపిడ్ పరీక్ష చేశారు. ఇందులో నిర్ధారణ అయింది. దీంతో అధికారులు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా కరోనా పాజిటివ్‌గా తేలింది. ముందుగా వీరు కరోనా లక్షణాలు, జలుబు, జ్వరం, కీళ్ల నొప్పులు వంటి వాటితో వైద్యాధికారులను సంప్రదించటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అయితే, బాధితులంతా హోం ఐసోలేషన్‌లో ఉండి వైద్య సేవలు పొందుతున్నారు.



● జీజీహెచ్‌లో 30 పడకలు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇప్పటికే 30 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. కరోనా కేసులు ఎక్కువ సీరియస్ అయితే జీజీహెచ్‌లో వైద్యచికిత్సలు అందిస్తారు. అయితే ప్రస్తుతం నమోదయిన కేసులు ప్రాథమిక స్థాయిలోనే ఉండటంతో బాధితులను హోం ఐసోపోలేషన్‌లోనే ఉంచి చికిత్సలు అందిస్తున్నారు.

ప్రాథమిక దశలోనే..

జిల్లాలో ఆరుగురికి కరోనా పరీక్షలు చేయగా అందరికీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరంతా హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. కరోనా తీవ్రత మాత్రం లేదు. ప్రాథమిక దశలోనే నిర్ధారణ అయింది.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

జాగ్రత్తలు తీసుకోవాలి

కరోనా బాధితులతో అనుబంధంగా ఉన్న వారందరికీ పరీక్షలు చేశాము. చుట్టు పక్కల వారు జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్కులు, శానిటైజర్లు. పస్తుత బాధితులకు వచ్చిన కరోనా తక్కువ స్థాయిలో ఉండటంతో ఎలాంటి ప్రమాదం లేదు.

- డాక్టర్ భాస్కర్, ఎపిడమాలజిస్ట్

విజయోస్తు!

- నేటినుంచే 'డీ'ఎస్సీ పరీక్షలు
- 8 కేంద్రాలు.. 31,221 మంది అభ్యర్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు.. పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

నిరుద్యోగ యువత ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ- 2025 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 31,221 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్నాహ్నం 12 గంటల వరకు, మధ్నాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిర్ణీత సమయానికి గంట ముందు గానే కేంద్రాలకు చేరుకోవాలని ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు హెచ్చరించారు. ఇక పరీక్షల నిర్వహణలో త్రీమెన్ కమిటీ సభ్యులతోపాటు ఇతర అధికారులు, సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తారు.

నెల్లూరు(విద్య), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎస్‌జీటీ కలిపి 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు 31,221 మంది పోటీ పడుతున్నారు. నెల్లూరులో 2, కోవూరు 1, కావలిలో 2, గూడూరులో 1, విద్యానగర్‌లో 2 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు వైద్యశిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరాకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

● స్క్రైబ్‌ల ఏర్పాటు

దివ్యాంగుల కోసం ఇంటర్ అర్హత కలిగిన వారిని సహాయకులుగా వినియోగించుకోనున్నారు. వీటికి సంబంధించిన ఇతర విషయాలను అభ్యర్థులకు కేంద్రంలో అధికారులు తెలియచేస్తారు. అంధత్వం కలిగిన అభ్యర్థులు స్క్రైబ్‌లను వినియోగించుకునే వారికి 50 నిమిషాలు అదనంగా సమయం కేటాయిస్తున్నారు. ఆర్థో హ్యాండీక్యాప్డ్ వారికి ఎటువంటి అదనపు సమయం వర్తించదు. కేంద్రాల్లో పీహెచ్‌సీ జెన్యూనిటీ పరిశీలించి మెడికల్ బోర్డు(డీఎంహెచ్‌ఓ) జారీ చేసిన సర్టిఫికెట్లు ఉన్నవారికే స్క్రైబ్‌లను కేటాయించనున్నారు. హాల్‌టికెట్లలో నమోదైన తప్పులపై అభ్యర్థులు ఆందోళన చెందవద్దని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ ధ్రువీకరించిన నకలు కాపీని అందచేసి కేంద్రం వద్దే సరిచేసుకునే ఏర్పాట్లను చేశారు.

ఏమైనా సమస్యలుంటే..
6281704160, 8121947387, 8125046997, 9398810958, 7995649286, 7995789286, 9963069286, 7013837359 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు





ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : డీఎస్సీ పరీక్షలకు ఆర్టీసీ అధికారులు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను ఏర్పాటు చేసింది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల మేనేజర్లతోపాటు ఉన్నతాధికారులకు రాష్ట్ర అధికారులు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో డిపో మేనేజర్లు పరీక్ష కేంద్రాల వైపు వెళ్లే బస్సుల డ్రైవర్లు, కండక్టర్లకు పలు సూచనలు అందించారు.

కట్టుదిట్టంగా నిర్వహణ

డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. సమయం దాటిన తరువాత కేంద్రంలోకి అనుమతించరు. అలాగే ఎలక్ట్రానిక్ పరికరాలకు కూడా అనుమతిలేదు, లోపలకు తెచ్చిన అభ్యర్థులపై చర్యలు తీసుకుంటాము. పీహెచ్‌సీ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసిన అభ్యర్థులు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారుల కౌంటర్ సంతకాలతో విధిగా పరీక్షకు హాజరు కావాలి. అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశాము.

- బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

పక్కా ఏర్పాట్లు : ఇన్చార్జి కలెక్టర్



డీఎస్సీ-2025 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు ఇన్చార్జి కలెక్టర్ కార్తీక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై అధికారులతో ఆయన సమీక్షించారు. కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు జరుగుతున్నందున ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలే ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని, గంట ముందుగానే కేంద్రం వద్దకు చేరుకునేలా సన్నద్ధం కావాలన్నారు. అలాగే వైద్య సదుపాయాలు, మంచినీటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఈ సమీక్షలో డీఆర్‌ఓ ఉదయ్‌భాస్కర్, డీఈఓ బాలాజీరావు, డీఎంహెచ్‌ఓ సుజాత, నెల్లూరు, కావలి ఆర్డీఓలు వంశీకృష్ణ, అనూష తదితరులు పాల్గొన్నారు.



ఈ గబ్బు.. ఇంకెన్నాళ్లు!

పత్రికలు ఘోషిస్తున్నా.. పర్యావరణం దెబ్బతింటున్నా కోళ్ల వ్యర్థాల రవాణా మాత్రం ఆగడం లేదు. ప్రతిరోజూ లోడ్ల కొద్దీ వ్యర్థాలు చేపల చెరువుల్లోకి డంప్ అవుతున్నాయి. ఏదో మొక్కుబడిగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలు పట్టుకుంటున్నట్లు పోలీసులు చెబుతున్నా తెర వెనుక భారీస్థాయిలోనే ఈ తతంగం జరుగుతోంది. మరోవైపు చికెన్ వ్యర్థాలయితే ఖర్చు తక్కువ, తక్కువ కాలంలోనే చేప కౌంట్ వస్తుంది. దీంతో పెంపకందారులు సంప్రదాయ మేతను పక్కన పెట్టి ఆ వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ప్రధానంగా విదేశాలకు ఎగుమతి అయ్యే ఫంగస్, రూప్ చంద్ రకం చేపల పెంపకందారులు చికెన్ వ్యర్థాలను వినియోగిస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన మత్స్య శాఖ సిబ్బంది కొరత పేరుతో చేతులెత్తేయగా, రెవెన్యూ, పంచాయతీ శాఖలు అటువైపు కన్నెత్తి చూడటం మానేశాయి.

- పూర్తి వివరాలు 8లో..

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు బిట్-2 రేషన్ డీలర్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు తహసీల్దారు కృష్ణప్రసాద్ తెలిపారు. విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు, ఏఓ బి.వెంకటరెడ్డి తమ సిబ్బందితో కలిసి కోడూరు బిట్-2 గ్రామంలోని చౌకదుకాణంలో తనిఖీలు చేశారు. అవకతవకలకు పాల్పడటంతో షాప్ నెం.0928014 డీలర్‌పై 6-ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోండి

నెల్లూరు (క్రైం) : కుటుంబసభ్యులతో కలిసి ముస్లింలు బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య సూచించారు. శనివారం బక్రీద్ సందర్భంగా గురువారం రాత్రి ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా వ్యవహరించినా, రెచ్చగొట్టే ప్రసంగాలు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర డీఎస్పీ పి సింధుప్రియ, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సీడీపీవో కార్యాలయంలో ఇండక్షన్ స్టౌలు

అంగన్వాడీలకు ఇండక్షన్ స్టౌలు, కుక్కర్లు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకరమైన భావిభారత సమాజాన్ని నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తోంది. ఇప్పటికే అనేక వస్తువులు కల్పించగా, తాజాగా అంగన్వాడీల్లో వంటకాల కోసం ఇండక్షన్ స్టౌలు (విద్యుత్), కుక్కర్లు, పాన్‌లను సరఫరా చేస్తోంది. ఇప్పటికే ఈ సామగ్రి సీడీపీవో కార్యాలయాలకు చేరగా, ఎంపీ, ఎమ్మెల్యేల ద్వారా వాటిని పంపిణీ చేయించడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు సత్వరమే భోజనాలు తయారు చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడనున్నాయి. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఒత్తిడి లేని విద్యను అంగన్‌వాడీల్లో బోధిస్తారు. గర్భిణులలో రక్తహీనత తదితర ఆరోగ్య సమస్యల నివారణకు ప్రతి నెలా సరుకులు ఇస్తున్నారు. బాలింతలకు కూడా అదే తరహాలో ఆహార కిట్లు అందచేస్తున్నారు.

ఇంటర్ జవాబుపత్రాల ట్యాంపరింగ్‌పై విచారణ

- వివరాలు 8లో..



సింహ వాహనంపై చాముండేశ్వరి దేవి

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో శ్రీ చాముండేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి అమ్మవారు సింహ వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



రోడ్డుపక్కన షేక్ అజీమా మృతదేహం

ఆటోను ఢీకొన్న కారు

- ఇద్దరి మృతి.. 9 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషయం
- ఆత్మకూరు సమీపంలో ఘటన

వారంతా రెక్కాడితేగానీ డొక్కా డని మహిళా కూలీలు. పొరుగూ రులో పనుల కోసం ఉదయాన్నే అంతా ఆటోలో బయలుదేరారు. కాసేపట్లో గమ్యం చేరతామన్న సమయంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను వేగంతో దూసుకొచ్చిన ఓ కారు ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్‌తోపాటు ఓ మహిళ మృతి చెందగా, తొమ్మిది మంది మహిళలకు గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఆత్మకూరు సమీపంలోని ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన కూలీల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

8

విద్యా శాఖలో భారీగా బదిలీలు

నెల్లూరు (విద్య), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సిబ్బందికి స్థానచలనం కలిగింది. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా నాన్‌టీచింగ్ సిబ్బంది 42 మంది వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.పద్మకుమారిని ప్రకాశం జిల్లా ఒంగోలు విద్యా శాఖ కార్యాలయానికి, అక్కడున్న వి.విజయ్‌కుమార్‌ను నెల్లూరుకు బదిలీ అయ్యారు. అలాగే ఏపీ ఓపెన్‌స్కూల్ జిల్లా కోఆర్డినేటర్, జిల్లా పరీక్షల విభాగం ఏడీగా పని చేస్తున్న ఎస్‌కె.అసదుల్లాఖాన్‌ను కర్నూలు జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఏడీగా బదిలీ చేశారు. వీరితో పాటు ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, 17 మంది జూనియర్ అసిస్టెంట్లు, 12 మంది రికార్డ్ అసిస్టెంట్లు, ఐదుగురు ఆఫీస్ సబార్డినేట్లు, ఒక గార్డినర్, ఒక వాచ్‌మన్ వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీ అయిన సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

మొక్క స్నేహితుడితో సమానం

వనమహోత్సవంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎంపీ వీపీఆర్

నెల్లూరురూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :ఒక మొక్క మంచి స్నేహితుడితో సమానమని, ప్రతి ఒక్కరు విధిగా తమకు అనుకూలమైన ప్రాంతాలలో మొక్క నాటి సంరక్షించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరురూరల్ మండలం దొంతాలి వద్ద నున్న నగరవనంలో గురువారం వనమహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మొక్కలునాటి నీరు పోశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు నాటడంతోపాటు చెట్లను నరకకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మంచినీరు నుంచి పీల్చే గాలి వరకు అన్నీ కాలుష్యం అయిపోయిన ఈ దుస్థితిలో మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు రెడ్యూస్, రీయూస్, రీసైకిల్, రీప్లేస్ అనే నినాదాలను పాటించాలని పిలుపునిచ్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో మహ్మద్‌బాషా, ఆర్డీవో అనూషా, కమిషనర్ నందన్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



నాటిన మొక్కకు నీళ్లు పోస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఫొటోలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఇతర అధికారులు

నేడు బుచ్చి నగర పంచాయతీ దుకాణాలకు వేలం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని డాక్టర్ ఉక్కాల రాజేశ్వరమ్మ, డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లలోని పలు దుకాణాలకు శుక్రవారం వేలం పాటలు నిర్వహించనున్నట్లు కమిషనర్ డీ.బాలకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ ఉక్కాల రాజేశ్వరమ్మ షాపింగ్ కాంప్లెక్స్‌లోని రూము నెంబరు 1, 13 షాపులు, డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్సులోని రూము, నెంబరు 7(ఎస్.సి), 10 షాపులకు ఉదయం 10.30గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9432
వెండి కిలో ధర	రూ. 106700
వెండి ఒక గ్రాము	రూ. 109.70



కోవూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తదితరులు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ, జనసేన నేతలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక గురువారం గుమ్మళ్లదిబ్బ కాలనీలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాటూరు చేనేత క్లస్టర్‌కు రూ.76లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మంజూరు చేయించారని తెలి పారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు సొంత ఇళ్లు లేకుంటే వెంటనే గృహ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. అవినీతికి తావులేని నియోజకవర్గంగా తీర్చి దిద్దాలనే ధ్యేయంతో పనిచేస్తున్నామ న్నారు. గుమ్మళ్లదిబ్బ కాలనీ సమస్యల పరిష్కా రానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, బాలా రవి, పిచ్చుక మధుసూదనరావు, యాకసిరి వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీపీ శ్రీనివాసులు, ఎంఈవో దిలీప్ కుమార్ అన్నారు. గురువారం బుచ్చిరెడ్డిపాళెంలోని విద్యాశాఖ కార్యాలయం వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షించుకునేందుకు ఉద్యమంలా ఉపాధ్యాయులు, విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. భూతాపం, అకాల వర్షాలు, భూకంపాలు, సునామీ వంటి విపత్తులకు కారణం పర్యావరణం విధ్వంసం కావడమేనన్నారు. పర్యావరణం పరిరక్షించుకునే విషయంలో నిర్లక్ష్యం చేస్తే భావితరాలు భయానక వాతావరణానికి గురికావాల్సి ఉంటుందన్నారు. వారసత్వానికి స్వచ్ఛమైన వాతావరణాన్ని కానుకగా ఇవ్వాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 పి. వెంకట రత్నం, మత్స్యశాఖ ఎఫ్‌డీవో పొట్టెయ్య, గండికోట సుధీర్‌కుమార్, విశ్రాంత లైబ్రేరియన్ భూపతి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందుకూరుపేట : మండలంలోని కొత్తూరు పీఎంఏవై ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సం దర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు శ్రీనివాసులు, అత్తిపాటి శరత్, నెల్లూరు వెంకటశేషయ్య, తువ్వార రాంబాబు, మేనాటి చంద్ర, శివ, దొంతాల మహేష్, తదిత రులు పాల్గొన్నారు.

రాపూరు : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతతో పాటు మన భవిష్యత్తుకు భద్రత అని రాపూరు అటవీ శాఖ స్క్వాడ్ సెక్షన్ అధికారి వర ప్రసాద్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని అటవీశాఖ వసతి గృహాల ఆవరణలో రాపూరు రేంజర్ రవీంద్ర బాబు ఆదేశాల మేరకు అటవీశాఖ, పోలీసు శాఖ అనుసంధా నంతో 80 మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వర ప్రసాద్ మాట్లాడుతూ అందరూ మొక్కలను నాటాలని, చెట్లను పరిరక్షించి భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపూరు సెక్షన్ బీట్ అధికారులు సాల్మన్ రాజు, రంజిత్, షఫీ, ఎస్ఐ వెంకట రాజేష్, ఎంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న, సర్పంచ్ భూపతి జయమ్మ, అటవీ, పోలీసుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తుకూరు: ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అదాని కృష్ణపట్నం పోర్టులో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ స్థిరమైన భవిష్యత్తును నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ప్రయత్నించాలన్నారు. పోర్టు ఉద్యోగులు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఉద్యోగులు పోర్టు పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. పోర్టు పర్యావరణ శాఖ నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు సీఈఓ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదానీ కృష్ణపట్నం పోర్టు ఉద్యోగులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ గురువారం నేలటూరులోని సూపర్ క్రిటికల్ థర్మల్ కాంప్లెక్స్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈసందర్భంగా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ హెడ్ సునీల్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ మొక్కలు పచ్చదనాన్ని పెంచడమే కాకుండా అందరికీ ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడతాయన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పటివరకు 12లక్షల మొక్కలను నాటామన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కంపెనీ నేతృత్వంలోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఉద్యోగులు వెయ్యి మొక్కలను నాటారు. ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఉద్యోగుల బృందం కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకత్వంలో మైపాడు బీచ్ శుభ్రపరిచే కార్యకలాపాలను కూడా నిర్వహించారు. నెల్లూరు నగరంలో నిర్వహించిన హరిత ర్యాలీలో పాల్గొన్నారు.

వెంకటాచలం: స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వీఎస్‌యూ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు విచ్చేసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడే విధంగా పరిశోధనలు చేపట్టాలని కోరారు. భవిష్యత్తులో వీఎస్‌యూ పచ్చదనంతో నిండాలని, ప్రతి ఒక్కరూ వారి వారి గ్రామాల్లో, ఇళ్లలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కల పెంపకం

● సర్వేపల్లిలో 1.25 లక్షల మొక్కలు నాటేందుకు సన్నాహాలు

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని ఓ ఉద్యమంలా చేపట్టాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటాచలంలోని ఎంపీడీవో కార్యాలయంతోపాటు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ హరితాంధ్ర కోసం అడుగేద్దాం, ప్లాస్టిక్ పెనుభూతాన్ని తరిమేద్దాం, ప్రతి ఒక్కరం మొక్కలు నాటుతామనే ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఒక్కో మండలంలో 25 వేలు చొప్పున సర్వేపల్లిలో 1.25 లక్షల మొక్కలు నాటబోతున్నట్లు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, అన్ని శాఖల ఉద్యోగులు నాలుగు మొక్కల చొప్పున దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ నేతలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధులు కూడా బాధ్యత చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, ఎంపీడీవో కల్పన, టీడీపీ నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, చల్లా నాగార్జున్‌రెడ్డి, వల్లూరు రమేష్‌నాయుడు తదితరులున్నారు.



మొక్కలు నాటుతున్న సీఈవో జగదీష్‌పటేల్



మొక్కలు నాటుతున్న వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



మొక్కలు నాటుతున్న ఎస్ఈఐ ఎనర్జీ ఉద్యోగులు



మొక్కలు నాటుతున్న అటవీ, పోలీసు శాఖ సిబ్బంది

వేమిరెడ్డి దంపతులతోనే కోవూరు నియోజకవర్గ అభివృద్ధి

కోవూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గ అభివృద్ధి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులతోనే సాధ్యమని పలువురు టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక పీవీఆర్ కళ్యాణ మండపంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వేమిరెడ్డి దంపతులపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. గ్రావెల్, ఇసుక కుంభకోణాలతో నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించిన ప్రసన్నకు వేమిరెడ్డి దంపతులను విమర్శించే అర్హతలేదన్నారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. వెన్ను పోటు పొడిచిన నాయకులే వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పెన్నానది కరకట్టను ఎవరు దోచుకుతిన్నారో అందరికీ తెలుసునని చెప్పారు. వేమిరెడ్డి దంపతులను విమర్శిస్తే ప్రసన్న అవినీతి భాగోతాల చిట్టా విప్పుతా మన్నారు. ఈ సమావేశంలో పెన్నాడెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, గుత్తా శ్రీనివాసులు, ఏకొల్లు పవన్‌రెడ్డి, ఏటూరు శ్రీహరిరెడ్డి, బెజవాడ జగదీష్, వీరేంద్ర, గాదిరాజు అశోక్‌కుమార్, నాపా వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నాగమాంబాపురంలో జరుగుతున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి వైభవంగా కల్యాణం జరిగింది. బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మురళి దంపతులు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, సుబ్రహ్మణ్యం నాయుడు, విడవలూరుకు చెందిన ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యం రెడ్డి, కనుపర్తి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవ స్వామికి పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

వాహన తనిఖీలు

అనంతసాగరం జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ఆవులు, గేదెలతో వెళ్తున్న ఆటోను పట్టుకొని వారి వద్ద సరైన పత్రాలు ఉన్నాయా? లేవా? పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు.

కసుమూరులో పారిశుధ్య పనులు ప్రారంభం

వెంకటాచలం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరులో పారిశుధ్య లోపం అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో గత రెండు రోజుల క్రితం ప్రచురితం కావడంతో గురువారం పంచాయతీ కార్యదర్శి పీ తిరుపతమ్మ స్పందించారు. గ్రామంలోని సైడు కాలువలు, దర్గా పరిసర ప్రాంతాలతోపాటు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. సైడ్ కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలు, దర్గా పరిసరాలలో చెత్త నిల్వలను తొలగించారు. పూడుకుపోయిన మురుగు కాలువలను యథాస్థితికి తీసుకొచ్చి మురుగునీరు పారేలా చేశారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.



కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

రాజకీయాల్లో ఆవేశం పనికిరాదు : నల్లపరెడ్డి

కోవూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఆవేశం పనికిరాదని మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. వైసీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది కాలంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని తాను విమర్శించలేదన్నారు. తమపై ఆవేశంగా మాట్లాడటం తగదన్నారు. పాత స్నేహితులను విడచిపెట్టవద్దని కోరారు. సమావేశంలో వైసీపీ నాయకులు వీరి చలపతిరావు, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, శివుని నరసింహులురెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, కవరగిరి ప్రసాద్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు పర్యవేక్షణతో నేర నియంత్రణ

● కృష్ణపట్నం పోర్టు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి

ముత్తుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల పర్యవేక్షణతో నేర నియంత్రణకు చర్యలు తీసుకున్నామని కృష్ణపట్నం పోర్టు ఎస్ఐ జేపీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కీలక ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు.

ఇంటర్వ్యూ

?. నేర నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి.

!నేరాలను నియంత్రించేందుకు స్టేషన్ పరిధిలో 50కిపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాము. ప్రధాన కూడళ్లలో జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పర్యవేక్షిస్తున్నాము.

? పారిశ్రామిక ప్రాంతాల్లో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకున్నారు.

! అదాని కృష్ణపట్నం పోర్టు నేలటూరులోని థర్మల్ కేంద్రాల పరిధిలో ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించాం. వాహనాల డ్రైవర్లు నియమ నిబంధనలు పాటించేలా చూస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవు.

? తీర ప్రాంత రక్షణకు తీసుకున్న చర్యలు ఏమిటి.

! తీర ప్రాంత గ్రామాల్లో ప్రధానంగా మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం. తీరంలో అపరిచిత బోట్లు వ్యక్తుల సంచారాన్ని తెలియజేయాలని కోరాం. తీర ప్రాంత రక్షణలో వారిని భాగస్వాములను చేస్తున్నాం.



కామాక్షితాయి సేవలో ఉప లోకాయుక్త జస్టిస్

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయాన్ని గురువారం ఏపీ ఉప లోకాయుక్త జస్టిస్ పగిడి రజనీరెడ్డి దంపతులు సందర్శించారు. మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ముందుగా ఈవో ఏవీ.శ్రీనివాసులు రెడ్డి, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గోత్ర నామములతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ పండితులు స్వామి, అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ఆశీర్వచనాలు అందజేశారు.

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులను అరికట్టాలి



కావలి డీఎస్పీని కలిసిన దళిత సంఘర్షణ సమితి నేతలు

కావలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ ఫైనాన్స్ వేధింపులకు గురై అనేకమంది పేదలు ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోందని వారి దుర్మార్గాలను అరికట్టాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి గురువారం కావలి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఆయన మాట్లాడుతూ కావలి డివిజన్‌లో ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలు, తండల వ్యాపారస్థులు, కాల్‌మనీ చేసే వారి దుశ్చర్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కలిగిరి మండలంలో కల్లుగీత కార్మికుడు రత్తయ్య ఆత్మహత్యకు కూడా ప్రయివేట్ ఫైనాన్స్ వేధింపులు కారణమన్నారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, గురువారం నాటికి 41.210 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 385 క్యూసెక్కులు వస్తుం డగా పెన్నాడెల్టాకు 3,250, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

సాంఘిక సంక్షేమ శాఖలో అస్తవ్యస్తంగా బదిలీల ప్రక్రియ

● కానరాని జిల్లా ప్రాతిపదిక

● యూనియన్ నాయకుల కనుసన్నల్లో జాబితా

● డీఆర్వో ఫైల్ తిప్పి పంపినా కానరాని మార్పు

● ప్రధాన కార్యాలయ సిబ్బందికి కనపడని నిబంధనలు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాంఘిక సంక్షేమశాఖలో బదిలీలల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. నిబంధనలకు విరుద్ధంగా యూనియన్ నాయకులు రూపొందించిన జాబితా ఫైల్‌ను డీఆర్వో తిరస్కరించారు. దీంతో ఆ ఫైల్ సంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం, కలెక్టరేట్ మధ్య చక్కర్లు కొడుతోంది. అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతుండగా, ఒక్క సాంఘిక క సంక్షేమ శాఖలో మిత్రం భిన్నంగా జరుగుతుండటంతో విమర్శలకు తావిస్తోంది. ఐదేళ్లు పూర్తి చేసిన వారిని, రిక్వెస్ట్ బదిలీలు కోరుకున్న వారి నుంచి ముందే ఆప్షన్లు తీసుకుని ఖాళీలను ప్రకటించాల్సిన ఆ శాఖ అధికారులు, ఆప్షన్లు తీసుకున్న తర్వాత ఖాళీలు ప్రకటించం, బదిలీల ప్రక్రియను గుట్టుచప్పుడు కాకుండా జరుపుతుండటంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 11 నుంచి 14 సంవత్సరాలపాటు ఒకేస్థానంలో పని చేస్తున్న వారు నిబంధనలకు విరుద్ధంగా అక్కడే కొనసాగాలని, బదిలీ తప్పదనుకుంటే సమీపంలోని మరో స్థానానికి వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు.

● **కానరాని ఉమ్మడి జిల్లా ప్రాతిపదిక**



జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు జరపాలని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నా ఆ శాఖ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవ హరిస్తున్నారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న, నెల్లూరు జిల్లాకు చెందిన వారు, నెల్లూరు జిల్లాకు రావాలంటే, ఇక్కడ నుంచి కొంత మంది తిరుపతి జిల్లాకు వెళ్లాలనే విచిత్ర ప్రతిపాదనను ఆ శాఖ అధికారులు తీసుకువస్తున్నట్లు సమా చారం. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి తిరుపతి జిల్లాలో ఆరేళ్లకు మించి పని చేస్తున్న వారు నెల్లూరుకు రావాలనుకుంటే, ఇక్కడ ఎక్కువ కాలం పనిచేస్తున్న వారిని ఆ జిల్లాకు పంపకుండా వీరు ఇక్కడే.. వారు అక్కడే అన్న సూత్రాన్ని ఆ శాఖ అధికారులు అనుసరిస్తుండటం ఉద్యోగులలో ఆందోళన వ్యక్తం అవుతోంది.

● **నిబంధనలు వారికి వర్తించవా!?**

సంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో సిబ్బంది దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ఎన్నో విమర్శలను ఎదుర్కొంటున్న వీరు ఆ సీట్లను వదిలి బయటకు రావటం లేదు. జిల్లాల పునర్విభజన జరిగిన సమయంలో జిల్లా కార్యాలయం నుంచి కొంత మంది జూనియర్ ఉద్యోగులను తిరుపతికి పంపారు. తాజాతా వారు తిరిగి నెల్లూరు జిల్లాకు వచ్చే పరిస్థితి కనపడటం లేదు. ఇక్కడి సిబ్బందిని అక్కడకు పంపి, అక్కడున్న వారిని నెల్లూరుకు తీసుకురావాల్సిన అధికారులు ఆ దిశగా పూనుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సాంఘిక సంక్షేమశాఖలో బదిలీలను నిబంధనల ప్రకారం, ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

C.R.I.M.E N.E.W.S



నిందితులతో రూరల్ ఎక్సైజ్ పోలీసులు

48 కేజీల గంజాయి పట్టివేత

● ఒడిశా నుంచి తిరుపతికి అక్రమ రవాణా

● ఎక్సైజ్ పోలీసుల అదుపులో 4 నిందితులు

● కారు స్వాధీనం

నెల్లూరురూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి తిరుపతికి కారులో అక్రమంగా తరలిస్తున్న 48 కేజీల గంజాయిని నెల్లూరురూరల్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సీఐ ప్రసన్నలక్ష్మి వెల్లడించారు. తమ సిబ్బంది వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా ఒడిశా ప్రాంతానికి చెందిన శివప్రసాద్ మిషాల్, పూజా మిషాల్, కన్ను ప్రసాద్ మిషాల్, బుడుపంగిలు కారులో అనుమానాస్పదంగా కనిపించారన్నారు. దీంతో కారును తనిఖీ చేయగా రెండు సంచుల్లో 48 కేజీల గంజాయి ఉండడాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మొత్తం గంజాయిని ఒడిశాలో రూ.50 వేలకు కొనుగోలు చేసి తిరుపతిలో అధిక ధరలకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. వీరి నుంచి 192 ప్యాకెట్లలో ఉన్న 48 కేజీల గంజాయి, రూ.5 వేలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని చెప్పారు. గంజాయి రవాణాపై గట్టి నిఘా ఉందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు మునీర్ అహ్మద్, శకుంతలదేవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ కాలేషావలి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

మోటారు బైకుల ఢీ: ఒకరికి గాయాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్త్‌కొండాయపాళెం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు రెండు మోటారుబైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల మేరకు ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారుబైక్‌లు ఒక్కసారిగా అదుపు తప్పి ఢీకొన్నాయి. దీంతో ఓ మోటారుబైకులో ప్రయాణిస్తున్న నార్త్‌కృష్ణంరాజుపల్లి గ్రామానికి చెందిన వేంపల్లి వెంకటసుబ్బరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పొగతోటలోని ఓ వైద్యశాల సమీపంలోని కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి రామ్మూర్తినగర్ 45/2 సచివాలయ వీఆర్‌వో సునీతకు సమాచారం అందించారు. ఆమె చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు 35 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉన్నాడు. మృతుని కుడి చేతిపై అమ్మ అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100): 530	



ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన జనసేన నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 5(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరానికి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎంఏ షరీఫ్‌ను జనసేన పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా కార్యాలయం ఇన్‌చార్జి జమీర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర రామిరెడ్డి, ఏపీ హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మీర్జా అబిద్‌లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రేపు కంచి పీఠాధిపతి రాక

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఈనెల 7వతేదీ రాత్రి 8గంటలకు మూలాపేట శంకరమఠంకు విచ్చేస్తున్నారని ఆ మఠం మేనేజర్ నందకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి అల్లీపురంలో శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయం పునఃప్రతిష్ఠ సందర్భంగా విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. తిరిగి 8వతేదీ ఉదయం 6గంటలకు కంచికి బయలుదేరి వెళతారని తెలిపారు.

8న ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునఃప్రతిష్ఠ

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామలింగాపురం బ్రిడ్జి వద్ద ఈనెల 8వ తేదీ మాజీ మంత్రి ఆనం వెంకటరెడ్డి విగ్రహం పునఃప్రతిష్ఠ జరుగుతుందని మాజీ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మైపాడుగేటు వద్ద ఓ పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మినీబైపాస్ రోడ్డులో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం సందర్భంగా ఆ విగ్రహాన్ని తీసి పక్కన పెట్టారని తెలిపారు. దానిని తిరిగి పునఃప్రతిష్ఠ చేస్తున్నామన్నారు. ఆనం అభిమానులు అందరూ తరలిరావాలని కోరారు.

61వ రోజుకు మజ్జిగ చలివేంద్రం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్టోన్‌హౌస్‌పేటలో జిల్లా రైస్ క్యాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం 61వ రోజు కానసాగింది. గురువారం మజ్జిగ దాతలుగా మునగా కుటుంబం వ్యవహరించింది. దాతల సహకారంతో 100 రోజులు మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

8న ప్రదోషకాల అభిషేకాలు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో ఈనెల 8వ తేదీ సాయంత్రం 4గంటలకు ప్రదోషకాల అభిషేకాలు జరుగుతాయని ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నందీశ్వరస్వామికి, మూలస్థానేశ్వరుడికి జరిగే అభిషేకాల కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు. అభిషేకాలు అనంతరం చిన్న వెండి నందిపై మూలస్థానేశ్వరుడు, భువనేశ్వరికి ప్రాకార ఉత్సవం జరుగుతుందని తెలిపారు.

ఓం అమ్మ శ్రీమాత ఆలయ నిర్మాణానికి స్థలం వితరణ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వరపురం పరిధిలోని లక్ష్మీపార్వతినగర్‌లో ఓం అమ్మ శ్రీమాత మందిరం నిర్మాణం కోసం లక్షల విలువైన స్థలంను దానం చేశారు. దాతలు పీఎంపీ నరసాపురం ప్రసాద్, రమాదేవి దంపతులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని వితరణ చేసిన వారి పేర్లతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళల కోలాటాలు ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో సుధాకర్, ప్రభాకర్, నాగేశ్వరరావు, దశరథ, తేజ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక బోన్‌మ్యారో మార్పిడి శస్త్ర చికిత్స

నెల్లూరు(వైద్యం), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక విధానంలో బోన్‌మ్యారో మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతగా జరుగుతున్నాయని బోన్‌మ్యారో శస్త్రచికిత్స నిపుణులు అంకాలజిస్ట్ డాక్టర్ రంగరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ల్యుకేమియా, లింఫోమా, మైలోమా, ఎప్లాస్టిక్, ఎనీమియా అనేక రకాలుగా పిలవబడే బ్లడ్ కేన్సర్ రోగులకు ఈ బోన్‌మ్యారో మార్పిడి శస్త్రచికిత్స అవసరమవుతుందని తెలిపారు. బ్లడ్‌కేన్సర్‌లలో కీమోథెరపీ, రేడియాథెరపీల వల్ల కొంతమందిలో ఎముక మజ్జను దెబ్బతీస్తాయని, అలాంటి వారికి బోన్‌మ్యారో మార్పిడి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బోన్‌మ్యారో మార్పిడి శస్త్రచికిత్సలో ప్రత్యేక వైద్య బృందం అందుబాటులో ఉందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్పీ కార్యాలయం సమీపంలో రహదారి పక్కన గురువారం ట్రైసైకిల్‌లో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440700018, 9440333191 నెంబర్లకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ రోశయ్య కోరారు.

భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని కాపాడాలి

● జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మొక్కలు నాటిన ఏపీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి, జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, తదితరులు

నెల్లూరు(జడ్పీ), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు తరాల కోసం ప్రకృతిని కాపాడే బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భగా నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె. ప్రమోద్‌కుమార్ రెడ్డి, జడ్పీ సీఈవో విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్ రావులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

● నెల్లూరు(విద్య) : నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో బాలాజీరావు మొక్కలను నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, సెక్టోరియల్ అధికారులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కళాశాల హాస్టల్ భవనం సమీపంలో మెక్కలను నాటారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలు ఎం.ప్రణవ్య, వి.తబిత, జె.హైమావతిలకు బహుమతులు అందచేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్జేడీ వరప్రసాద్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్స్ బి.ప్రసన్న, టి.భారతి, అధ్యాపకులు కె.కొండయ్య పాల్గొన్నారు.

● నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరిగింది. ప్రపంచ పర్యావరణ దినోత్సం ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించి, పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం లైబ్రరీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రజాసైన్స్ వేదిక నగర అధ్యక్షుడు ఎం.సతీష్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ సునీత, సిబ్బంది కృష్ణయ్య, జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



మెక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



డీఈవో కార్యాలయంలో మొక్కలు నాటుతున్న డీఈవో బాలాజీ రావు

● నగరంలోని జమాతే హింద్ నెల్లూరు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షుడు నవీద్ అహ్మద్ మాట్లాడారు. పర్యావరణంపై ఖురాన్‌లోని వాఖ్యాలను వినిపించారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : మూలాపేటలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మూలాపేటలో మెక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ బీజేపీది బానిస మనస్తత్వమని, దేశ ప్రధాని మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సరెండర్ అయ్యారంటూ కాంగ్రెస్ యువరాజు రాహుల్ గాంధీ చేసిన వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలన్న బీజేపీ నాయకులు ఖండిస్తూ మూలాపేటలో నిరసనలు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, శిరీష, నాగేంద్ర సింగ్, శివకుమార్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో వివరాలివ్వండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : నగరంలో అన్ని డివిజన్లలో జరుగుతున్న రీ సర్వేలో ఉద్యోగులకు ప్రజలు తమ వివరాలు సమగ్రంగా అందచేయాలని కమిషనర్ సూచించారు. కార్పొరేషన్‌లోని తన చాంబరులో గురువారం ఆయన మాట్లాడారు. ప్రతి భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే ద్వారా అదనపు భవనాలకు డిమాండ్ పూర్తిస్థాయిలో వేయడం జరుగుతుందన్నారు. పన్ను నవరణకు అందరూ సహకరించాలని కోరారు. డంపింగ్ యార్డులలో చెత్తను లెగసి వేస్ట్ బయోమైనింగ్ ద్వారా రీసైకిల్ చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా రూ.2లకే 20 లీటర్ల తాగునీటిని అందిస్తున్నట్లు తెలిపారు. మంత్రి నారాయణ చొరవతో యూజీడీ పనులు జరుగుతున్నాయని, ఒక్క రూపాయికే కనెక్షన్ అందచేస్తున్నట్లు తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చొరవతో దొంతాలి వద్ద వేస్ట్ ఎనర్జీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

సీఏఎం హైస్కూల్లో అసాంఘికాలను అరికట్టండి

నగరంలోని సీఏఎం హైస్కూల్ ప్రాంగణంలో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నాయని, తక్షణం వాటిని అరికట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ ప్రాంతంలో మందుబాబులు, వ్యభిచార కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, గోహత్యలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెంచలయ్య, కాజామస్తాన్, మాల్యాద్రి, సత్యరాజు పాల్గొన్నారు.

ఏసీఎస్ వైద్య కళాశాలలో యోగాసనాలు



యోగాసనాలు వేస్తున్న వైద్య విద్యార్థులు

నెల్లూరు(వైద్యం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం వైద్య విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగాసనాల ప్రొటోకాల్ శిక్షణ నోడల్ అధికారి డాక్టర్ శివరాం, యోగా మాస్టర్ రవీంద్ర వైద్య విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. వైద్య కళాశాల, జీజీహెచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ మాట్లాడారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వైష్ణవి, యోగా మాస్టర్ భవాని తదితరులు పాల్గొన్నారు.


విద్యతోనే గౌరవం : మేయర్ స్రవంతి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మేయర్ స్రవంతి, తదితరులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): విద్యతోనే గౌరవం లభిస్తుందని, గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాని కార్పొరేషన్ మేయర్ పోట్లూరి స్రవంతి పేర్కొన్నారు. పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య పంతులు 128వ జయంతిని పురస్కరించుకుని యానాదీస్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని జయభారత్ హాస్పిటల్ సమావేశ మందిరంలో గురువారం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేయర్ 12 మంది గిరిజన విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించిందని, అన్ని అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోట్లూరి శ్రీనివాసులు, తలపల రమేష్, గంధళ్ల శ్రీరాములు, ఈగ రామయ్య, వేటగిరి సుధాకర్‌రావు, వేటగిరి మోహన్‌రావు, వెత్రి చెంచయ్య, బాపట్ల వెంకటపతి, శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బక్రీదు ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష



బక్రీదు ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వైఓ.నందన్

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని బారాషహీద్ దర్గా ఆవరణంలో గురువారం నగర కమిషనర్ వైఓ.నందన్ ఈనెల 7న జరిగే బక్రీద్ పండుగ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రార్థనలు చేసుకునే ముస్లింలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై శాఖలు వారీగా సమీక్షించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. కమిషనర్ చేస్తున్న బక్రీదు ఏర్పాట్లుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, మైనార్టీ నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్‌కు హంస నాయకుల వినతి



ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి సమస్యలు తెలుపుతున్న చేజర్ల సుధాకర్‌రావు, పరిమళ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఏపీ హంస నాయకులు కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలను వివరించామన్నారు. తమ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో హంస గౌరవసలహాదారు అరవ పరిమళ, జిల్లా నాయకులు జలీల్ అహమ్మద్, గౌస్‌బాషా, రాజయ్య, మురళి, నాగరాజమ్మ, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మామపై అల్లుడు దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : కుటుంబకలహాల నేపథ్యంలో మామపై అల్లుడు దాడి చేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసు సమాచారం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటలో షేక్ గౌస్‌బాషా నివాసం ఉంటున్నారు. ఆయన తన కుమార్తె సమీన్‌కు కోటమిట్ట ప్రాంతంకు చెందిన అప్సర్‌తో గతేడాది వివాహం చేశారు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగినా మనస్పర్థల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుంది. రెండు నెలల కిందట ఖాజీ కోర్టు వద్ద అప్సర్ భార్యపై దాడి చేశాడు. బాధితురాలు అప్పట్లో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 4వ తేది గౌస్‌బాషా బారాషాహీద్‌దర్గాలో పనులు ముగించుకొని ఇంటికి బయలుదేరారు. ప్రధాన ద్వారం వద్దకు వచ్చేసరికి అప్సర్ అతనిని అడ్డుకొని తన చేతికున్న ఇనుప కడియంతో దాడి చేశాడు. గాయాలపాలైన గౌస్‌బాషా జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు బాధితుడు గురువారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేషన్‌లో పలువురి బదిలీ

నెల్లూరు(సిటీ), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ కార్యాలయంలో పని చేస్తున్న వివిధ విభాల్లో అధికారులు, సిబ్బందిని బదిలీ చేస్తూ కమిషనర్ నందన్ గురువారం ఉత్తర్వులిచ్చారు. పీఆర్వోగా కొనసాగుతున్న జూనియర్ సహాయకుడు ఎన్ కృష్ణకిషోర్‌ను కమిషనర్ పేషీ ఇన్‌చార్జిగా నియమించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)లో జూనియర్ సహాయకుడు ఎస్ శరత్‌చంద్రను కమిషనర్ సీసీగా నియమించారు. సీనియర్ సహాయకుడు టీ.రవికుమార్‌ను ఎన్నికల విభాగానికి బదిలీ చేశారు. జూనియర్ సహాయకుడు ఎంవీబీ కృష్ణారావును పీజీఆర్‌ఎస్, పురమిత్రలతో పాటు పురపాలక శాఖ సేవల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఆప్కాస్‌లో జూనియర్ సహాయకుడు బీదేవాదీప్తీని హెచ్7,8, జీఎస్, డబ్ల్యుఎస్ విభాగానికి బదిలీ చేశారు. ఆప్కాస్ విభాగానికి సీ1లో ఉన్న భార్గవిని, బిల్ కలెక్టర్‌గా కే హరీష్‌ను సీసీసీ విభాగానికి, ఔట్‌సోర్సింగ్‌లో ఉన్న నవీన్ రూరల్ డివిజన్ల ఈఆర్పీ సర్వీసులకు, బీ శ్రీనివాసును సిటీ డివిజన్ల ఈఆర్పీ సర్వీసులకు బదిలీ చేశారు.

ఏపీసీసీ క్రమశిక్షణ సభ్యుడిగా ఉడతా వెంకట్రావు



ఉడతా వెంకట్రావును సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

నెల్లూరు(వైద్యం), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా నెల్లూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్ నియమితులయ్యారు. జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువరు నేతలు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఉడతా వెంకట్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేస్తామని వెల్లడించారు.

నగరంలో ఆలయాల అభివృద్ధికి చర్యలు

● పరిశీలించిన దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లు



రంగనాయకులపేట పేరంటాలమ్మ ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవదాయ శాఖ ఇంజనీర్ల బృందం

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పలు ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ఉన్నతాధికారులు పరిశీలించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిల ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ జీవీఆర్ శేఖర్, మల్టీజోన్ ఉపస్థపతి ఎం.నాగేశ్వర నెహ్రూ, గుంటూరు డీఈఈ సీహెచ్.శ్రీనివాసులు, నెల్లూరు ఏఈఈ ఏ.మురళీమోహన్, నెల్లూరు సహాయ స్థపతి సురేంద్రలు గురువారం సిటీలో పర్యటించారు. నవాబుపేట మల్లేశ్వరాలయం, మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం, తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, వెంకటమ్మ పేరంటాలమ్మ ఆలయాలను పరిశీలించారు. నవాబుపేట శివాలయం పునఃనిర్మాణానికి సంబంధించిన ప్లానును నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కేబీ.శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డిలు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి సమీక్షించారు. మంత్రి పలు సూచనలు చేశారు. ఆ అభివృద్ధి పనులుకు ప్రతిపాదనలు వేయాలని ఇంజనీరింగ్ అధికారులను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు.

నేటి నుంచి చంద్రన్న పల్లె పండుగ

● 18 గ్రామాల్లో రూ.11 కోట్ల పనుల ప్రారంభం ● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్లోని 18 గ్రామాల్లో రూ.11 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను చంద్రన్న పల్లె పండుగ పేరుతో ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులోని తన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం గొల్లకందుకూరు, సజ్జాపురం, కొత్త, పాత వెల్లంటిలు, కందమూరు గ్రామాల్లో పూర్తయిన పనులను ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. 7న దొంతాలి, ఆమంచర్ల, ఉప్పుటూరు, సౌత్‌మోపూరు గ్రామాల్లో, 8న కలివెలపాళెం, పెనుబర్తి, మాదరాజుగూడూరు, కాకుపల్లి గ్రామాల్లో, 9న ములుముడి, కొమ్మరపూడి, కొండ్లపూడి, పొట్టేపాళెం గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ముందుకు పరుగెడుతున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు తన అపార అనుభవంతో ముందుకు నెడుతున్నారని తెలిపారు.

పేరంటాలమ్మ ఆలయ భూమి వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంకటమ్మ పేరంటాలమ్మ ఆలయానికి చెందిన మనుమసిద్ధినగర్‌లోని సర్వేనెంబరు 107లో 1.24 ఎకరాల భూమిని లీజుకు కేటాయించేందుకు గురువాంరం ఈ టెండరు కమ్- సీల్డ్ టెండర్ - కమ్ బహిరంగ వేలం జరిగింది. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకుడిగా దేవాదాయ ధర్మాదాయశాఖ డీసీ కేబీ.శ్రీనివాసరావు, ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డిలు పాల్గొన్నారు. అమ్మవారికి చెందిన ఆ భూమిని గతంలో లీజుకి తీసుకున్న వ్యక్తి సక్రమంగా లీజు చెల్లించకపోవడంతో కమిషనర్, జేసీ ఆదేశాల మేరకు బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో 5 మంది పాటదారులు పాల్గొనగా 1.24 ఎకరాలకు ఏడాదికి రూ.3.02 లక్షల లీజు చెల్లించేలా పేటేటి ప్రద్యుమ్న పాట పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇరుకళల పరమేశ్వరి ఆలయం ఈవో వీ.గిరికృష్ణ, ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఆలయ ఈవో ఎం.మోహన్‌కుమార్, డీసీ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్‌వీ.సుధాకర్, పాల్గొన్నారు.

పగలే వెన్నెల!



నెల్లూరు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. నెల్లూరు - ముత్తుకూరు రహదారి ధనలక్ష్మీపురం వద్ద కొన్ని రోజులుగా పట్టపగలే వీధి దీపాలు వెలగుతున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన స్థానికులు అనేక సార్లు ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరు పట్టించుకోలేదని వాపోయారు. రాత్రుళ్లు నగరంలో కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు లేక ప్రజలు అగచాట్లుపడుతుంటే మరికొన్ని ప్రాంతాల్లో పగలే వెలుగుతున్నాయి.

- నెల్లూరురూరల్,(ఆంధ్రజ్యోతి)

ఎస్‌వీఆర్ స్కూల్ కరస్పాండెంట్‌కు డాక్టరేట్

నెల్లూరు(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎస్‌వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ ఏ.శ్రీనివాసులు డాక్టరేట్ అందుకున్నారు. ఇంటర్నేషనల్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ, రియల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లు సంయుక్తంగా తమిళనాడులోని హోసూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ అందజేశారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించడంతో పాటు, సామాజిక సేవల్లో గుర్తింపు పొందడంతో తనకు డాక్టరేట్ లభించిందని శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

ఈ గబ్బు.. ఇంకెన్నాళ్లు!

- ఆగని చికెన్ వ్యర్థాల తరలింపు • చేపలకు ఆహారంగా వేస్తున్న అక్రమార్కులు
- ఇవి తింటే ప్రజల ఆరోగ్యానికి ముప్పే • చెరువులు, పరిసరాలూ కలుషితం
- మామూళ్ల మత్తులో అధికారులు.. పోలీసులదీ అదే తీరు

ఆంధ్రజ్యోతి పరిశీలన

సంగం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సంగం, చేజర్ల, బుచ్చిరెడ్డిపాలెం, టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు తదితర సముద్ర తీర మండలాల్లో సుమారు వేల ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. చేపల చెరువులు సాగు చేస్తున్న కొందరు చేపలకు మేత ఖర్చు తక్కువని సంప్రదాయ మేతకు బదులుగా కోళ్ల వ్యర్థాలను వినియోగిస్తున్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కడప, రాయలసీమ జిల్లాల్లో చికెన్ దుకాణాల్లో వృథాగా పడవేసే కోళ్ల వ్యర్థాలను సేకరించి డ్రమ్ముల్లో వేసుకుని వాహనాల్లో చేపల చెరువులకు తరలిస్తున్నారు. అక్కడ ఒక డ్రమ్ము చికెన్ వ్యర్థాలు రూ.500లకు కొని చేపల సాగు రైతులకు రూ.1600 నుంచి 1800లకు మూడంతల ఆదాయానికి విక్రయిస్తున్నారు. ఒక్కో లారీలో 60 నుంచి 80 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలు తీసుకువస్తే సుమారు రూ.50 వేలకుపైగా ఆదాయం వస్తుంది. ఈ లెక్కన నెలకు సుమారు రూ.15 లక్షల ఆదాయం సంపాదిస్తున్నారు. ఎక్కువగా రూప్‌చంద్, ఫంగస్ చేపల గుంటలకే వీటిని మేతగా వేస్తుంటారు. ఈ వ్యాపారన్ని అడ్డుకోకుండా దీని వెనుక ఒక పెద్ద ముఠా ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ ముఠా చేతివాటంతో ఇటు మత్స్యశాఖ, అటు పోలీస్‌లు అడ్డుకోకుండా తతంగం నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి తీసుకువస్తుండడంతో చెరువు వద్దకు చేర్చేసరికి కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజలుతున్నాయి. కొంతమంది (ఫంగస్ చేపలకు) నేరుగా చేపలకు మేతగా వేస్తుండగా మరికొందరు ప్రత్యేక పాత్రల్లో ఉడకబెట్టి మేతగా వేస్తున్నట్లు సమాచారం. దీంతో చెరువులోని నీరు పూర్తిగా పాడవుతోంది. చేపల చెరువుల నుంచి ఆ నీరు ఊట కాలువలకు విడిచిపెట్టినప్పుడు ఆ కలుషిత



చెరువులో చేపలకు ఆహారంగా వేసిన కోళ్ల వ్యర్థాలు

నీరంతా సమీపం పంట పొలాల్లో పారుతోంది. కొందరు చికెన్ వ్యర్థాలకు వినియోగించిన డ్రమ్ములను పెన్నానదిలో శుభ్రం చేస్తున్నారు. దీంతో పెన్నా జలాలు, చెరువుల్లో నీరు కలుషితమవుతున్నాయని ప్రజా క్షేమం కోరేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• నియంత్రణ శూన్యం

కోళ్ల వ్యర్థాలు తరలించేవారిపై మత్స్యశాఖ సిబ్బంది నిఘా ఉంచి వాహనాలను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కానీ ఆ శాఖ అధికారులు సిబ్బంది కొరత పేరుతో పత్తాలేకపోవడంతో పోలీసులు ఇటీవల అడపాదడపా దాడులు చేసి ఒకటో, రెండో చికెన్ వ్యర్థాలు తరలించే వాహనాలను సీజ్ చేస్తున్నారు. గతంలో రాత్రింబవళ్లు తేడాలేకుండా ప్రతినిత్యం కడప వైపు నుంచి సంగం మండలం మీదుగా పదుల సంఖ్యలో వాహనాలు వస్తున్నాయి. కోళ్ల వ్యర్థాల తరలించే వాహనం పట్టుబడితే దీని పర్మిట్‌ను, డ్రైవర్ లైసెన్స్‌ను రద్దు చేయాలి. అంతేగాక వ్యర్థాలను వేసే చెరువుల లైసెన్సును రద్దు చేయాలి. అలా జరగడంలేదు. ఒకవేళ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేస్తే వాహనాలకు కోర్టులో పూచీకత్తు అందజేసి రిలీజ్ చేసుకుని మళ్లీ వ్యర్థాలను తీసుకువచ్చేందుకు వెళుతుండటం గమనార్హం.

• అధికారులకు మామూళ్ల మత్తు

చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనదారుల నుంచి కొందరు నెలసరి మామూళ్లు దండుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో చేపల చెరువులు ఉన్న మండలాల పోలీస్ స్టేషన్ పరిధిలో కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనాల నుంచి మామూళ్లు వసూలు చేసి కిందస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కోళ్ల వ్యర్థాలు తరలించే వారి వ్యాపారంతోపాటు చేపల గుంటల యజమానులకు, అధికారుల ఆదాయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిలుతుందని బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

• చెరువులకు కాలువల నీరు

చేపల చెరువులకు అనుమతి ఇచ్చేటప్పుడే బోరుపాయింట్ ఉందా లేదా అని చూసి మత్స్యశాఖ అనుమతి ఇస్తారు. బోరు పాయింట్ ఉంటేనే అనుమతి ఇవ్వాలి. కానీ మామూళ్ల మత్తులో మత్స్య శాఖ ఇవేమి పట్టించుకోకుండా చేపల చెరువులకు అనుమతి ఇస్తున్నారు. దీంతో నిర్వాహకులు పంట పొలాలకు వెళ్లే కాలువలకు మోటార్లు పెట్టి నీటిని నిరంతరం లిఫ్టు చేస్తున్నారు. అయినా ఇరిగేషన్‌శాఖ పట్టించుకోవడం లేదు. సాగు నీరు పుష్కలంగా ఉన్నప్పుడు తోడుకుంటే పర్వాలేదుకానీ సాగునీటి కొరత ఉన్నప్పుడు ఈ చెరువుల వల్ల పంట పొలాల రైతులకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

• వ్యాధులు ప్రబలే ప్రమాదం

చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలను వినియోగించడం వల్ల తీవ్రస్థాయిలో దుష్పరిణామాలు తలెత్తుతాయి. ఈ చేపలను తిన్నా, కలుషితమైన నీటి వల్ల శ్వాసకోస వ్యాధులతోపాటు కేన్సర్, ఇన్‌ఫ్లుయంజా, ఫ్లూ వంటి చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.



ఇలాంటి లారీల్లోనే వ్యర్థాలు వచ్చేది!

• కఠిన చర్యలు తీసుకోవాలి

కోళ్ల వ్యర్థాల రవాణా నియంత్రణకు అధికారులు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. లేకపోతే భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని చెరువులన్నీ ఎందుకూ పనికిరాకుండా పోయే ప్రమాదముంది. కోళ్ల వ్యర్థాలను తీసుకువచ్చే వారిపైనా, చెరువుల్లో మేతగా వేసేవారిపైనా ఇటు మత్స్యశాఖ, అటు పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించాలి. కేసుల నమోదుతోనే సరిపెట్టడం కాకుండా వ్యర్థాల రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలి.

ఉత్సాహంగా గ్రీన్ ర్యాలీ



గ్రీన్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా ఉన్నతాధికారులు

ప్లాస్టిక్ నిషేధం కేవలం నినాదంగా కాకుండా ప్రజలంతా తమ జీవన విధానంలో భాగంగా గుర్తించి సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వీఆర్ కళాశాల నుంచి ఏసీ స్టేడియం వరకు గ్రీన్ ర్యాలీని ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ప్లాస్టిక్ సంచులు వద్దు - క్లాత్ సంచులు ముద్దు అంటూ చేసిన నినాదాలు మారుమోగాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో హానికరమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూసేజీ ప్లాస్టిక్ బ్యాగులకు బదులు క్లాత్, జ్యూట్ బ్యాగులను వాడాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు 10 వేలకుపైగా చేతి (క్లాత్) సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్, డీఎఫ్‌వో గురప్ప, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నది

• ఎస్పీ కృష్ణకాంత్ • ఉద్యోగ విరమణ పొందిన వారికి ఆత్మీయ వీడ్కోలు

నెల్లూరు(క్రైం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోం ప్రతినిత్యం సవాళ్లతో కూడుకున్నదని, సుదీర్ఘకాలం అదేశాఖలో పనిచేసి ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ పొందడం చాలా అదృష్టమని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. పోలీసుశాఖలో సుదీర్ఘకాలం సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్‌ఐలు వై.విజయకుమార్, కె.జయరాజు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్‌డీ.అహ్మద్, ఏ.మాల్యాద్రిలను సతీసమేతంగా గురువారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ జీ.కృష్ణకాంత్ సత్కరించి ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వృత్తి బాధ్యతలలో ఉద్యోగ విరమణ సహజమని, ఇంత నిబద్ధతగా విధులు నిర్వర్తించడానికి వెనక మీ కుటుంబసభ్యుల తోడ్పాటు ఎంతో ఉందన్నారు. విశ్రాంత జీవితంలో ఏ సహాయం కావాలన్నా నేరుగా సంప్రదించవచ్చని, మీకు సహాయం అందించడాని పోలీస్ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, హోమ్ గార్డ్స్ డీఎస్పీ ఎన్‌వీ రమణ, ఏవో చంద్రమౌళి, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, అసోషియేషన్ నాయకులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ సత్కారం అందుకున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య, తదితరులు

ఇంటర్ జవాబుపత్రాల ట్యాంపరింగ్ వ్యవహారంపై విచారణ

కందుకూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కందుకూరులోని ప్రైవేటు కాలేజీలో జరిగిన ఇంటర్ జవాబుపత్రాల ట్యాంపరింగ్ వ్యవహారంపై గురువారం ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ జయలక్ష్మి విచారించారు. పట్టణంలోని శ్రీ గాయత్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు ట్యాంపరింగ్ కారణంగా నష్టం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించిన ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులు వారిద్దరికీ మార్కులు కలపటంతోపాటు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో జయలక్ష్మి కందుకూరు వచ్చి ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీవివేకా జూనియర్ కాలేజీలో విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, ట్యాంపరింగ్‌కు బాధ్యుడిగా భావిస్తున్న ఇన్విజిలేటర్ కృష్ణారావు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌ను, బాధిత విద్యార్థులను, తల్లిదండ్రులను, బాధిత విద్యార్థుల విద్యాసంస్థ అయిన శ్రీగాయత్రీ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావును విచారించి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ అందరి స్టేట్‌మెంట్లు రికార్డు చేసినందున విచారణ నివేదిక అందజేస్తానని తదుపరిచర్యలు బోర్డు సెక్రటరీ తీసుకుంటారని తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో సీట్ల కేటాయింపు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సీట్లు కేటాయించామని ఏపీఎస్‌డబ్ల్యూఈఆర్ఐ కోఆర్డినేటర్ టీ.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. సీటు వచ్చిన వారికి ఫోన్ ద్వారా మెసేజ్ పంపామని, దాని ఆధారంగా సంబంధిత గురుకులానికి వెళ్లి సీటు ఖరారు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. సీటు ఖరారు చేసుకోకపోతే సీటును కోల్పోతారని తెలిపారు

వెన్నుపోటుకు బ్రాండ్ జగనే!

సొంత తల్లి, చెల్లికి వెన్నుపోటు పొడిచింది ఆయనే

దమ్ముంటే నా ప్రశ్నలకు జవాబు ఇవ్వండి

నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (వైద్యం) జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోటుకు మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అని నుడా చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. గురువారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెన్నుపోటు అనే పదాన్ని ఉచ్చరించే అర్హత జగన్‌కు గాని వైసీపీకి గాని లేదని స్పష్టం చేశారు. జన్మనిచ్చిన తల్లిని, తోడబుట్టిన చెల్లిని వెన్నుపోటు పొడిచిన నేత జగనేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెన్నుపోటు దినానికి పిలుపు నిచ్చిన జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చున్నాడంటూ ఎద్దేవా చేశారు. బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలి పోటు పొడిచింది ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉండవల్లి అరుణ్‌కుమార్, వైఎస్ఆర్ ఆత్మ కేవీపీ, సూరీడులను వెన్నుపోటు పొడిచింది ఎవరో రాష్ట్ర ప్రజలకు తెలుసనని అన్నారు. ఆస్తి కోసం సొంత చెల్లెలు షర్మిలను ఇంటినుంచి గెంటేసిన వ్యక్తి వెన్నుపోటు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రౌడీషీటర్లను పరామర్శించేందుకు వెళ్లిన జగన్‌ని రౌటీషీటర్ అనాలా.. శాడిస్ట్ అనాలా అన్ని ప్రశ్నించారు. వైసీపీ ఓ పనికిమాలిన పార్టీ అంటూ దుయ్యబట్టారు. వైసీపీ అభిమానించే నేతలు ఒక్కసారయినా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని చెప్పారు. వైసీపీకి దమ్ముంటే తాను అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు మామిడాల మధు, పిట్టి సత్యనాగేశ్వరరావు, కువ్వారపు బాలాజీ, తంబి సుజన్‌కుమార్, అంచూరు శ్రీనివాసులనాయుడు, సుభాన్‌బాషా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి

• పర్యావరణాన్ని కాపాడాలి • డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు(వైద్యం), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసి పర్యావరణానికి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో వైద్యులు, ఉద్యోగులు పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే ప్రచారంతో ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఎదుర్కొవడంపై దృష్టిపెట్టామని చెప్పారు. భూమికి కలుగుతున్న కాలుష్యాన్ని ఎలా తగ్గించాలో చర్చిస్తామని, ఏమిచెయ్యాలో ఆలోచిస్తామని, తీర్మానాలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వాతావరణ కాలుష్యం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రత్యేకించి గాలి కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు, చర్మవ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 90 శాతం మంది పీల్చే గాలి కాలుష్యం అయిందన్నారు. దీంతో ప్రాణాంతక వాయువులు, ఇతర కణాలు ఉంటాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ కాలుష్యం వల్ల గుండె, మెదడు, చర్మం వంటి భాగాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ భాస్కర్, హుస్సేనమ్మ, డెమో కనకరత్నం, ఏవో నిశాంత్‌రెడ్డి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, వైద్యులు, ఉద్యోగులు

ఆటోను ఢీకొన్న కారు

- ఇద్దరి మృతి.. 9 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషయం
- ఆత్మకూరు సమీపంలో ఘటన

ఆత్మకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు సమీపంలోని ముంబాయి జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వెంకట్రావుపల్లి చెందిన 10 మంది కూలీలో వెళుతున్న ఆటోను కారు ఢీకొనడంతో ఇద్దరు కూలీలు మృతి చెందారు. 9 మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..

వెంకట్రావుపల్లిలోని పది మంది కూలీలు సమీప గ్రామమైన టి ముస్తాపురంలో పొగాకు గ్రేడింగ్ పనులకు ఆటోలో బయలుదేరారు. జాతీయ రహదారిపై ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద ఆటో మలుపు తిరుగుతుండగా మర్రిపాడు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీ కొంది. దాంతో కారు ఒకవైపు, ఆటో మరోవైపు పడిపోయాయి. ఆటోలో ఉన్న కూలీలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయారు. షేక్ అజీమా (60), ఆటో యజమాని, డ్రైవర్ దగుమాటి పుల్లారెడ్డి (45) అక్కడికక్కడే మృతి చెందారు. షేక్ గౌసున్నీసా, సలీ మా, గౌసున్నీసా, కిలారి వరలక్ష్మి, షేక్ హబీబున్నీసా, షేక్ అన్వర్‌జా, షేక్ రబియాబీ, షేక్ మస్తాన్‌బీ, షేక్ బియాంబీ గాయపడ్డారు. వీరిలో షేక్ సలీమ, షేక్ బియాంబీల పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తరలించారు. మిగిలిన వారిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో నారాయణస్వామికి చెవి వద్ద తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న సీఐ జి గంగాధర్, పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం, తొమ్మిది మందికి తీవ్రగాయాలవడంతో వెంట్రావుపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.



రోడ్డుపై పడిపోయిన కూలీలు



నుజ్జు నుజ్జు అయిన కారు, ఆటో



మృతుడు పుల్లారెడ్డి (ఫైల్)

• సీఎం, మంత్రి లోకేష్ విచారం

కాగా, ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

• మంత్రి ఆనం దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడం పట్ల రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఇద్దరు మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యశాల సూపరింటెండెంట్ శేషారత్నం, వైద్యసిబ్బందికి సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఫోన్‌లో అధికారులను కోరారు.

అనుకున్నదే జరిగింది!

- 'ఇరిగేషన్'లో రచ్చకెక్కిన ఎల్‌వోసీ యవ్వారం
- ఒకే కాంట్రాక్టర్‌కు మొత్తం బడ్జెట్ కేటాయింపు
- హైకోర్టుకెళ్లిన అవతలి కాంట్రాక్టర్
- అక్కడ తేలేదెప్పుడు.. డబ్బులొచ్చేదెప్పుడు?
- కీలక ప్రాజెక్టుల పనులపై ప్రభావం

నెల్లూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత క్వార్టర్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పెన్నా రివర్ కెనాల్స్ హెడ్‌కు రూ.17.5 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ మేరకు ఎల్‌వోసీ మంజూరు చేసి బిల్లులు అప్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఈ హెడ్ కింద పెన్నా కాజ్‌వే నిర్మాణ పనులు, డీఆర్-డీఎం ఛానెల్ ఆధునికీకరణ పనులు కీలక దశలో ఉన్నాయి. ఈ రెండు వర్కు లకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాజ్‌వేకు సుమారు రూ.23 కోట్ల వరకూ పెండింగ్ ఉండగా, డీఆర్-డీఎం ఛానెల్ పనులకు సుమారు రూ.12 కోట్ల వరకు బిల్లులు పెండింగ్ ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌వోసీను టీజీపీ సీఈ తొలుత ఈ రెండు వర్కులకు కేటాయించారు. కాజ్‌వే పనులకు రూ.11.5 కోట్లు, డీఆర్- డీఎం ఛానెల్‌కు రూ.6 కోట్లు కేటా యిస్తూ గత నెల 17వ తేదీన ఉత్తర్వు లు ఇచ్చారు. అయితే ఈ కేటాయింపు లపై కాజ్‌వే నిర్మాణ కాంట్రాక్టర్ అభ్యం తరం తెలిపారు. తనకు ఇంతవరకూ ఒక్క రూపాయి బిల్లు రాలేదని, తాను ప్రభుత్వ స్థాయిలో మాట్లాడుకొని ఎల్‌వోసీ తెచ్చుకుంటే, మీరు మరొకరికి ఇస్తే ఎలా అంటూ ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అదే సమయంలో డీఆర్-డీఎం చానెల్ కాంట్రాక్టర్ కూడా తాము ఈ ప్రభుత్వంలో పనులు చేశామని, తమకు సగం బిల్లు అయినా ఇస్తే గానీ మిగిలిన పనులు పూర్తి చేయడం సాధ్యం కాదని చెబుతున్నారు. ఈ క్రమంలో సీఈ ఉత్తర్వులు ఇచ్చాక కూడా బిల్లులు అప్‌లోడ్ చేయలేదు. మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద ఈ ఎల్‌వోసీ పంచాయితీ జరిగింది. ఈ క్రమంలోనే గత వారం మొత్తం ఎల్‌వోసీను కాజ్‌వే కాంట్రాక్టర్‌కు కేటాయిస్తూ సీఈ ఉత్తర్వు లను సవరించారు. దీంతో నెల్లూరు సెంట్రల్ డివిజన్ అధికారులు బిల్లు కూడా అప్‌లోడ్ చేశారు. అయితే వివా దం ముగిసిపోయిందని అందరూ అనుకునేలోపు డీఆర్-డీఎం చానెల్ కాంట్రాక్టర్ హైకోర్టుకెళ్లారు. తాము పనులు చేశామని, తమకు కేటాయించిన బడ్జెట్‌ను మరో కాంట్రాక్టర్‌కు ఇచ్చేశారంటూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు అడ్మిట్ చేసుకుంది. ఫైనాన్స్, ఇరిగేషన్ శాఖలకు నోటీ సులు అందాయి. దీంతో కాజ్‌వే కాంట్రా క్టర్‌కు డబ్బులు విడుదల చేయడంలో అడ్డంకులు ఏర్పడ్డాయి. హైకోర్టులో కేసు తేలే వరకూ బిల్లు ఇచ్చేందుకు వీలుండ దని ఇరిగేషన్ వర్గాలు చెబుతు న్నాయి. దీంతో ప్రభుత్వం బడ్జెట్ ఇచ్చి నా ఇద్దరు కాంట్రాక్టర్లలో ఏ ఒక్కరికీ దక్కకుండా పోయింది. ప్రస్తుతం రెండు వర్కుల పనులూ నిలిచిపోయాయి. బిల్లులు వస్తే గానీ కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టే సూచనలు కనిపించడం లేదు.

8న అఖిలభారత ఓపెన్ చెస్ పోటీలు

నెల్లూరు(విద్య), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఎస్వీ చెస్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ నెల 8వ తేదీన అఖిల భారత ఓపెన్ చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. పోటీలు జరిగే నక్షత్ర స్కూల్‌లో గురువారం ఆయన కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. విజేతలకు రూ.80వేల నగదుతోపాటు ఇతర ప్రోత్సాహకాలు అందించనున్నట్లు చెప్పారు. ఇక దేశవ్యాప్తంగా వచ్చేక్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కూడా కల్పిస్తున్నా మని చెప్పారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు వంశీకృష్ణ, సుధాశ్రీ, పాఠ శాల డైరక్టర్స్ జీవన్‌కృష్ణ, సంధ్యారెడ్డి, సాయి ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుపై శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లక్ష్మి పథకం ద్వారా కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుపై ఎంపిక చేసిన డీజీ లక్ష్మిలకు గురువారం మెప్మా అర్బన్ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెప్మా పీడీ లీలారాణి మాట్లాడుతూ డీజీ లక్ష్మిలు సీఎస్‌సీ సెంటర్లను ఏర్పాటు చేసి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఇప్పటి వరకు ఈ పథకంలో 300 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ, మెప్మా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శ పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సైమన్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో 10 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9432
వెండి కిలో ధర	రూ. 106700
వెండి ఒక గ్రాము	రూ. 109.70

పంచాయతీ సర్వసభ్య సమావేశం

వింజమూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీ జనరల్ బాడీ సమావేశాన్ని సర్పంచ్ నల్లగొండ సృజన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 62 అంశాలను సభ్యులతో చర్చించి ఆమోదించారు. అలాగే పట్టణంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు లేఖ ద్వారా తెలియజేశారు. రాబోవు వర్షాకాలంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరచాలని తీర్మానించారు. పంచాయతీ ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ గోపి శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీకి ప్రజలందరూ సహకరించి అభివృద్ధి పథంలో నడిపేందుకు సహకరించాలని, ఏ సమస్యలైనా తెలియజేస్తే పరిష్కారించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. సమావేశంలో పంచాయతీ సిబ్బంది, వార్డు మెంబర్లు, పాల్గొన్నారు.

జంతు వధ నిషేధం

చేజర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జంతు వధ నిషేధమని, అటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టరీత్యా నేరమని తహసీల్దారు బీ మురళి, ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వ హించారు. వారు మాట్లాడుతూ మూఢ నమ్మకాల పేరుతో ఆవులు, దూడలను వధించడం నేరమన్నారు.ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని జంతు వధ కార్యక్రమాన్ని నిషేధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీసులచే వాహన తనిఖీలు

అనంతసాగరం జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్త బస్టాండ్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ఆవులు, గేదెలతో వెళ్తున్న ఆటోను పట్టుకొని వారి వద్ద సరైన పత్రాలు ఉన్నాయా? లేవా? పరిశీ లించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు.

గోడపత్రిక ఆవిష్కరణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న శ్రీ మానసాదేవి అమ్మవారి 11వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను ఈ నెల 20 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చల్లా తిరుపతయ్య తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో గోడపత్రికలు, కరపత్రాలను ధర్మకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తొలిరోజు గణపతిపూజ, పుణ్యహవచనము, నవగ్రహ మండపారాధాన, ఉత్సవ, నవగ్రహ విగ్రహాలకు మహాస్నానము, అభిషేకాలు, మహాని వేదన, కల్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 21న హోమాలు, గ్రామోత్సవాలు, 22న వాల్మీక, కుంకుమపూజ, పొంగళ్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసా దాలను స్వీకరించి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 41.210 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, గురువారం నాటికి 41.210 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 385 క్యూసెక్కులు వస్తుండగా పెన్నాడెల్టాకు 3,250, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కండలేరు నీటి మట్టం..

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి స్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 39.422 టీఎం సీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్ ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2400 క్యూసె క్కులు, లోలెవల్ స్లూయూస్ నుంచి 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 50 క్యూసెక్కులు, మొత్తం 2510 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవు తుందని కండలేరు ఏఈ తెలిపారు.

ఏడాదిలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో సుపరి పాలన అందించారని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శాఖమూరి సుబ్బా రావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయం లోటులో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో సమర్థ వంతంగా ఆదాయ వనరులను పెంచుతూ యువతా, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. పరిశ్ర మలు, విమానాశ్రయాలు, హార్బర్ల నిర్మాణంపై కూడా ప్రతేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇన్ని చేస్తున్నా వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు.



మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు



ఉదయగిరి: మొక్కలు నాటుతున్న అధికారులు



సంగం: మండల పరిషత్ ప్రాంగణంలో..

పర్యావరణ పరిరక్షణ భావితరాలకు మేలు

ఆత్మకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్, ఫారెస్ట్ రేంజర్ శేఖర్ తెలిపారు. గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో, నారంపేట రోడ్డు సమీపంలోని ఎంఎస్ఎంఈ పార్కు వద్ద మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో భావితరాలకు ఎంతో ఉపయుక్తకరమన్నారు. ప్రస్తుతం పర్యావరణం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పర్యావరణం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్‌గా నియమితులైన కేతా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ ప్రతాప్‌రెడ్డి, ఏపీవో మధుసూధన్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్, అటవీశాఖ, ఎన్ఆర్ఈజీఎస్ జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం : ప్రపంచ పర్యా వరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రజా పరి షత్ కార్యాలయ ఆవరణలో టీడీపీ మండల కో-ఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం మండల నాయకులతో, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్క రూ కార్యోన్ముఖులు కావాలని, ప్రకృతిని మనం కాపాడితే అదే మనల్ని కాపాడుతుం దని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ వలి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, తురక వెంకటేశ్వర్లు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ, చంద్రరెడ్డి, తోట మనోజ్ , వెంగళశెట్టి వెంకట్రావ్, గౌస్,రాజశేఖర్, రవి, ఎడుకొండలు, దేవర వెంకటేశ్వర్లు, వీకాష్‌బాబు, జగదీష్, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని, అందులో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లా తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టీడీపీ నాయకులతో కలిసి స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ప్రకృతికి హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించరాదని నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి, దళితవాడ పాఠశాలలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, సందానీ, నరసింహా, నాగయ్య, వెంకటేశ్వర్లు, చిననరసింహా, నవాజ్, సుబ్రహ్మణ్యం, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో, ఉదయగిరి అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వోలు మురళి, ప్రసాద్, ఎఫ్ఎస్‌వో ఓంప్రకాష్, ఎఫ్‌బీవోలు ఖాజా మొహ్మద్, అఫ్జల్, భానుతేజ, చిన్నపరెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : పర్యావరణాన్ని కాపాడడంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ఎంపీ డీవో, ఏపీఎం నాగూర్‌వలి, ఆజంఖాన్ అన్నారు. గురు వారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం- వన మహోత్సవం కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, బూత్ ఇన్ చార్జి పోద మాధవరావు, పంచాయతీ కార్యదర్శి చంద్రశే ఖర్, నాయకులు షేక్ పీరయ్య పాల్గొన్నారు.



ఉదయగిరిలో మొక్కలు నాటి నీరు పోస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

వింజమూరు : ప్రభుత్వ వైద్యశాల ప్రాం గణంలో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఉద యగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు నిర్వహి స్తున్నట్లు టీడీపీ మండల నాయకులు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడు తూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసు కుని ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య శాల డీడీ ఓ.డాక్టర్ కార్తీక్, సర్పంచ్ సృజన, వైద్యశాల కమిటీ నెంబరు ఎంఎస్.నాయుడు, టీడీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, గూడా నర్సారెడ్డి, ఆనంగి రమణయ్య, జనసేన నాయకులు, బండారు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంగం : మండలంలో అన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయా కార్యాలయాల్లో ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. అందులో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ప్రాం గణంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటా రు. కార్యక్రమంలో ఈవోఆర్డీ వరప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు.

చేజర్ల, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పరావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు రావిపెంచలరెడ్డి, మండల అధ్యక్షులు షేక్ సిరాజ్, రావి లక్ష్మీనరసారెడ్డి చీర్ల వెంకటేశ్వర్లు, వెంకటయ్య, వీరరాఘవరెడ్డి తహసీల్దారు బీ మురళి, డీఆర్‌వో ఖాజారసూల్ ఎస్‌ఐ తిరుమలరావు పాల్గొన్నారు.



సీతారామపురం: మొక్కలు నాటుతున్న మండల నాయకులు



వింజమూరు: మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు, తదితరులు

విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు..

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు

ఉదయగిరి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అధికారం కోసం సొంత బాబాయిని హత్య చేయించి, తల్లికి, చెల్లికి వెన్నుపోటు పొడిచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ అన్నారు. గురువారం స్థానిక చెంచురామయ్య అతిథి గృహంలో టీడీపీ నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ వెన్నుపోటు కార్యక్రమం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబును ప్రజలు నాలుగు సార్లు ముఖ్యమంత్రి చేశారంటే ఆయన విజనరీ ఏంటో అందరికీ తెలుసన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసాలు సృష్టించి అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో సైతం వైసీపీని ప్రజలు ఆదరించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, సందానీ, నరసింహా, ఉప్పుటూరి వెంకటయ్య, శ్రీరాములు, నాగయ్య, ఉడతా సుమన్‌యాదవ్, అంబటి మస్తాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెంచలబాబు

గ్రామకొలను ఆధునికీకరణ పనులు పునఃప్రారంభం

చేజర్ల, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం ఆదేశాలతో సుమారు కోటి ఇరవై లక్షల నిధులతో మండల కేంద్రమైన చేజర్లకు సంబంధించిన పెద్ద చెరువు గ్రామకొలను ఆధునీకరణ పనులు గురువారం స్థానిక టీడీపీ నాయకులు, ఇరిగేషన్‌శాఖ అధికారులు పునః ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం కోటి ఇరవై లక్షల నిధులతో చెరువు ఆధునీకరణ పనులను ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే నిధుల సమస్యతో ఆదిలోనే పనులు నిలిపి వేశారు. అయితే ఇటీవల ఈ సమస్యను స్థానిక నాయకులు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఇరిగేషన్ అధికారులతో చర్చించి పనులు ప్రారంభించేలా ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం టీడీపీ నెల్లూరు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ రావిపెంచలరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, సీనియర్ టీడీపీ నాయకులు రావి లక్ష్మీనరసారెడ్డి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ యాసిన్, రావి ప్రసాద్ రెడ్డి, గోపి రెడ్డి, కృష్ణారెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

టీబీ బాధితులను గుర్తించండి

చేజర్ల, (ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఉన్న టీబీ బాధితులను గుర్తించి సరైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డా.ఎస్‌కే.ఖాదర్ వలి తెలిపారు. గురువారం మండలంలోని చిత్తలూరు పీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా ఆషా కార్యకర్తలతో ఇంటింటా సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన వారికి పరీక్షలు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు నవీన్ కుమార్, నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంకర క్వారీకి లీజుకు ఇవ్వొద్దు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమీపంలో ఉన్న కొండను కంకర క్వారీకి లీజుకు ఇవ్వొద్దని గురువారం మండలంలోని తిరుమలాపురం గ్రామస్తులు తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 178 సర్వేనెంబర్‌లోని 123.50 ఎకరాల కొండపోరంబోకు భూమిని ప్రభుత్వం ఇతరులకు కంకర క్వారీ తవ్వకానికి లీజుకు ఇచ్చేందుకు గ్రామంలో ఏ-1 నోటీసును జారీ చేసిందన్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న ఈ కొండను కంకర క్వారీకి లీజుకు ఇస్తే తామంతా గ్రామం విడిచి వెళ్లాల్సి వస్తుందన్నారు. కొండకు దగ్గరగా నివాసాలు సైతం ఉండడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. అధికారులు లీజు ప్రక్రియను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

భూ సమస్యలు వెంటనే పరిష్కరించండి

- ఆర్డీవో పావని

ఎస్‌పేట, జూన్5 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కారించాలని ఆత్మకూరు ఆర్డీవో పావని తెలిపారు. గురువారం ఆమె తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పందిపాడు, పెద్దబ్బీపురం, హసనాపురం, తదితర గ్రామాల నుంచి భూ సమస్యలపై అర్జీలను అందించారు. ఏఎస్‌పేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదని టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, అబ్దుల్ వాపోయారు. హసనాపురంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఆక్రమణ తొలగించాలని గ్రామస్తులు ఆర్డీవోకు అర్జీ ద్వారా తెలియజేశారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్‌కి పలు సమస్యలపై మొత్తం 24 అర్జీలు అందాయని డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మండల టీడీపీ అధ్యక్షులు అబ్బూరి రమేష్‌నాయుడు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో పావని

కొనసాగుతున్న ఎన్ఎంయూఏ నిరసన



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఉదయగిరి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ చేపడుతున్న నిరసన కార్యక్రమం మూడోరోజైన గురువారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని, సిక్ లీవ్‌లకు జీతాలు ఇవ్వాలని, కార్మికులపై పక్షపాత వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, శంకర్, నాగరాజు, విశ్వనాథ్, ఫణికుమార్, రాజశేఖర్, సుజాత, శ్రీను, రామాంజనేయులు, జ్యోతి, మాధవి, ఆర్ఎస్ రెడ్డి, సిద్ధయ్య, ఖాసింబీ, కోటేశ్వరరావు, కృష్ణయ్య పాల్గొన్నారు.

సేవలందించేందుకు సిద్ధం

వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పదవి విరమణ చేసిన ఉద్యోగులకు సేవలు అందించేందుకు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతిప్రియ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ జీపీఎఫ్ అదాలత్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్‌రావు, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కిషోర్‌రెడ్డి, కార్యాలయ అధికారులు విజయ్‌కుమార్, భవానీ, ప్రసాద్, సునీత పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖలో అస్థవ్యస్తంగా బదిలీల ప్రక్రియ

- కానరాని జిల్లా ప్రాతిపదిక
- యూనియన్ నాయకుల కనుసన్నల్లో జాబితా
- డీఆర్వో ఫైల్ తిప్పి పంపినా కానరాని మార్పు
- ప్రధాన కార్యాలయ సిబ్బందికి కనపడని నిబంధనలు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాంఘిక సంక్షేమశాఖలో బదిలీలల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. నిబంధనలకు విరుద్ధంగా యూనియన్ నాయకులు రూపొందించిన జాబితా ఫైల్‌ను డీఆర్వో తిరస్కరించారు. దీంతో ఆ ఫైల్ సంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం, కలెక్టరేట్ మధ్య చక్కర్లు కొడుతోంది. అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతుండగా, ఒక్క సాంఘిక క సంక్షేమ శాఖలో మిశ్రం భిన్నంగా జరుగుతుండటంతో విమర్శలకు తావిస్తోంది. ఐదేళ్లు పూర్తి చేసిన వారిని, రిక్వెస్ట్ బదిలీలు కోరుకున్న వారి నుంచి ముందే ఆప్షన్లు తీసుకుని ఖాళీలను ప్రకటించాల్సిన ఆ శాఖ అధికారులు, ఆప్షన్లు తీసుకున్న తర్వాత ఖాళీలు ప్రకటించం, బదిలీల ప్రక్రియను గుట్టుచప్పుడు కాకుండా జరుపుతుండటంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 11 నుంచి 14 సంవత్సరాలపాటు ఒకేస్థానంలో పని చేస్తున్న వారు నిబంధనలకు విరుద్ధంగా అక్కడే కొనసాగాలని, బదిలీ తప్పదనుకుంటే సమీపంలోని మరో స్థానానికి వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు.

కానరాని ఉమ్మడి జిల్లా ప్రాతిపదిక



జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు జరపాలని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నా ఆ శాఖ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవ హరిస్తున్నారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న, నెల్లూరు జిల్లాకు చెందిన వారు, నెల్లూరు జిల్లాకు రావాలంటే, ఇక్కడ నుంచి కొంత మంది తిరుపతి జిల్లాకు వెళ్లాలనే విచిత్ర ప్రతిపాదనను ఆ శాఖ అధికారులు తీసుకువస్తున్నట్లు సమా చారం. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి తిరుపతి జిల్లాలో ఆరేళ్లకు మించి పని చేస్తున్న వారు నెల్లూరుకు రావాలనుకుంటే, ఇక్కడ ఎక్కువ కాలం పనిచేస్తున్న వారిని ఆ జిల్లాకు పంపకుండా వీరు ఇక్కడే... వారు అక్కడే అన్న సూత్రాన్ని ఆ శాఖ అధికారులు అనుసరిస్తుండటం ఉద్యోగులలో ఆందోళన వ్యక్తం అవుతోంది.

నిబంధనలు వారికి వర్తించవా!?

సంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో సిబ్బంది దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. ఎన్నో విమర్శలను ఎదుర్కొంటున్న వీరు ఆ సీట్లను వదిలి బయటకు రావటం లేదు. జిల్లాల పునర్వి భజన జరిగిన సమయంలో జిల్లా కార్యాలయం నుంచి కొంత మంది జూనియర్ ఉద్యోగులను తిరుపతికి పంపారు. తాజాతా వారు తిరిగి నెల్లూరు జిల్లాకు వచ్చే పరిస్థితి కనపడటం లేదు. ఇక్కడి సిబ్బందిని అక్కడకు పంపి, అక్కడున్న వారిని నెల్లూరుకు తీసుకురావాల్సిన అధికారులు ఆ దిశగా పూనుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సాంఘిక సంక్షేమశాఖలో బదిలీలను నిబంధనల ప్రకారం, ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

C.R.I.M.E N.E.W.S



నిందితులతో రూరల్ ఎక్సైజ్ పోలీసులు

48 కేజీల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి తిరుపతికి అక్రమ రవాణా
- ఎక్సైజ్ పోలీసుల అదుపులో 4 నిందితులు
- కారు స్వాధీనం

నెల్లూరురూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి తిరుపతికి కారులో అక్రమంగా తరలిస్తున్న 48 కేజీల గంజాయిని నెల్లూరురూరల్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సీఐ ప్రసన్నలక్ష్మీ వెల్లడించారు. తమ సిబ్బంది వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా ఒడిశా ప్రాంతానికి చెందిన శివప్రసాద్ మిషాల్, పూజా మిషాల్, కన్ను ప్రసాద్ మిషాల్, బుడపంగిలు కారులో అనుమానాస్పదంగా కనిపించారన్నారు. దీంతో కారును తనిఖీ చేయగా రెండు సంచుల్లో 48 కేజీల గంజాయి ఉండడాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మొత్తం గంజాయిని ఒడిశాలో రూ.50 వేలకు కొనుగోలు చేసి తిరుపతిలో అధిక ధరలకు విక్రయించేందుకు వెళ్తున్నట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. వీరి నుంచి 192 ప్యాకెట్లలో ఉన్న 48 కేజీల గంజాయి, రూ.5 వేలు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని చెప్పారు. గంజాయి రవాణాపై గట్టి నిఘా ఉందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు మునీర్ అహ్మద్, శకుంతలదేవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ కాలేషావలి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

మోటారు బైకుల ఢీ: ఒకరికి గాయాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్త్‌కొండాయపాళెం గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు రెండు మోటారుబైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల మేరకు ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారుబైక్‌లు ఒక్కసారిగా అదుపు తప్పి ఢీకొన్నాయి. దీంతో ఓ మోటారుబైకులో ప్రయాణిస్తున్న నార్త్‌కృష్ణంరాజుపల్లి గ్రామానికి చెందిన వేంపల్లి వెంకటసుబ్బరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరుకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పొగతోటలోని ఓ వైద్యశాల సమీపంలోని కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి రామ్మూర్తినగర్ 45/2 సచివాలయ వీఆర్‌వో సునీతకు సమాచారం అందించారు. ఆమె చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు 35 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉన్నాడు. మృతుని కుడి చేతిపై అమ్మ అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 530

యోగాతో ఆరోగ్యం : ఎంపీడీఓ

లింగసముద్రం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు అన్నారు. గురువారం లింగసముద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లింగసముద్రం-1, పెంట్రాల, మొగిలిచెర్ల సచివాలయ సిబ్బందికి ఆయన యోగాసనాల పోటీలు నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు.



ఎంపీడీఓ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

న్యూస్ బాక్స్

ప్రైవేట్ ఫైనాన్స్ వేధింపులను అరికట్టాలి



కావలి డీఎస్పీని కలిసిన దళిత సంఘర్షణ సమితి నేతలు

కావలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ ఫైనాన్స్ వేధింపులకు గురై అనేకమంది పేదలు ప్రాణాలను కోల్పోవాల్సి వస్తోందని వారి దుర్మార్గాలను అరికట్టాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి గురువారం కావలి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఆయన మాట్లాడుతూ కావలి డివిజన్‌లో ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలు, తండల వ్యాపారస్థులు, కాల్ మనీ చేసే వారి దుశ్చర్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కలిగిరి మండలంలో కల్లుగీత కార్మికుడు రత్తయ్య ఆత్మహత్యకు కూడా ప్రయివేట్ ఫైనాన్స్ వేధింపులు కారణమన్నారు. వీరి వేధింపులకు దగదర్తి మండలంలో కూడా ఒకరు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు జెడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం, జ్వాలా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



శామీరపాలెంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ దయాసాగర్

వలేటివారిపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి శ్రామికులకు కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని ఏపీఓ దయాసాగర్ తెలిపారు. మండలంలోని శామీరపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వద్ద ఉపాధి శ్రామికులకు తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



కుందుడు గుమ్మ ఆటలో పాల్గొన్న చిన్నారులు

ఉలవపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో 35 రోజుల పాటు పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు ముగిసినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు గురువారం తెలిపారు. చిన్నారులకు పుస్తక పఠనంతో పాటు ఆటపాటలు నిర్వహించినట్లు తెలిపారు. క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశా మన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డు ఫీడర్‌లో 11కేవీ లైనుకు అడ్డంగా ఉన్న చెట్లు తొలిగించేందుకు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 10.30 గంటల వరకు ఆ ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని టౌన్ ఎఈ టీవీ నరసింహ్మం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని గణేష్ నగర్, కేసరిగుంట కాలనీ, గాయత్రీ నగర్, ఎమ్మెల్యే ఆఫీసు, డీవీ నగర్, ప్రశాంతి నగర్, కొత్తకుమ్మరిపాలెం, సింహాద్రి నగర్, ఎర్రవడ్డిపాలెం, వెంకటేశ్వర నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అలాగే ఓగూరు సబ్‌స్టేషన్ నుంచి పలుకూరు ఫీడర్‌కు వెళ్లే లైనులో కూడా చెట్ల తొలగింపు ఉన్నందున పలుకూరు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు.



కావలిటౌన్: మొక్క నాటి నీరు పోస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ, మున్సిపల్, అటవీశాఖ అధికారులు, టీడీపీ నేతలు



అల్లూరు : మొక్కలు నాటుతున్న తహసీల్దారు లక్ష్మీ నారాయణ



వలేటివారిపాలెం: చుండి మోడల్‌స్కూల్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : ఎమ్మెల్యే ఇంటూరి

● ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



కందుకూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పామూరురోడ్డు సర్కిల్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టరు తదితరులు

కందుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్క లు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పామూరు రోడ్డు సర్కిల్‌లో నిర్వహించిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ తదితరులు రోడ్డు మార్జిన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం వర్షపునీటి నిల్వ, ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె అనూష, అటవీశాఖ అధికారులు, మెప్మా సిబ్బంది, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, గుర్రం మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, ముచ్చు శ్రీను, చిలకపాటి మధు, ఉన్నం వీరాస్వామి, అత్తోట మధుబాబు, పెంట్రాల సుబ్బారావు, గుర్రం మలికార్జున, అత్తంటి శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సబ్ కోర్టు ఆవరణలో

పట్టణంలోని సబ్ కోర్టు ఆవరణలో అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎన్ నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్‌నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఎస్ పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ మురళీధర్, సీనియర్ న్యాయవాదులు ఎం మహేశ్వరరావు, టి తిరుమలరావు, ఎల్. బ్రహ్మయ్య, ఎస్కే మస్తాన్‌వలి, బి. రోశయ్య, షేక్ షంషుద్దీన్, జమీర్‌బాషా, సుల్తాన్‌బాషా, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

●కావలిటౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వాడవాడలా మొక్కలు నాటి వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ పార్కు వద్ద మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ మొక్కలు నాటారు. ఈసందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, అమరా వేదగిరి ,కిరణ్, కోటయ్య, ఖమర్‌బాబు, ఇబ్రహీం, మంచాల ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు మందా కిరణ్ అధ్యక్షతన నేతలు జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేతలు కందుకూరి సత్యనారాయణ, జీ భరత్‌కుమార్, పరుసు వెంకటేశ్వర్లు, సీవీసీ సత్యం, వాయుగండ్ల సుధీర్ తతదితరులు పాల్గొన్నారు.

పీజీ కళాశాలలో

ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ప్రాంగణంలో 200 మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాస్, సుశీల, పీడీ మణికంఠ, కార్పొరేషన్ తరపున డివిజనల్ మేనేజర్ పిచ్చయ్య, ప్లాంటేషన్ మేనేజర్లు నీరజ, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ప్రాంగణంలో

డీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో డిపో ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అధికారులు ఖాదర్‌మొహిద్దీన్, రత్నం, రవిప్రకాష్, జనార్ధనరావు, కార్మిక సంఘాల నేతలు కలాం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశ్రాంత ఉపాధ్యాయిని మొగిలిశెట్టి జమున ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంతో నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. తన నాట్యాలయ శిష్య బృందంచే పర్యావరణానికి సంబంధించిన వివిధ రకాల పండ్ల మొక్కలను చిత్రీకరించి జనతాపేట కూడలిలో వాటిని ప్రదర్శించి ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమాచంద్, విశ్వోదయా బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని మాధవి తదితరులు పాల్గొన్నారు.

● **కలిగిరి :** పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా నీటి యాజమాన్య సంస్థ జిల్లా పథ సంచాలకులు గంగాభవాని పెద్దకొండూరు, సిద్దన కొండూరు గ్రామాల్లో ఉపాధి సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, నిశ్శంకర సురేష్, బీజేపీ నాయకులు నందనవనం ప్రభాకరరావు, ఎంపీడీఓ కార్య లయ సిబ్బంది దీక్షితులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

● **అల్లూరు :** పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో నగర పంచాయతీ అధికారులు పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల తహసీల్దారు లక్ష్మీ నారాయణ, డిప్యూటీ తహసీల్దారు ప్రవీణ్ కుమార్, సచివాలయం-1 కార్యదర్శి వరప్రసాద్, ఆర్ఐ ప్రభు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎంపీడీఓ

అల్లూరులోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో, సిపిడబ్ల్యూఎస్ ప్రాజెక్టు ఆవరణతోపాటు పలు సచివాలయాల ప్రాంగణాల్లో ఎంపీడీఓ రజనీకాంత్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూయస్ ఏఈ పురుషోత్తం పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

అమ్మ పేరుతో ఓ మొక్కను నాటుదామనే దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని ఆ పార్టీ మండల కన్వీనర్ చెంతాటి కృష్ణ మోహన్ అన్నారు. అల్లూరు రామకృష్ణ కళాశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో మల్లికార్జున సింగ్, చాగంటి చెంగారెడ్డి, చెంతాటి నరేష్, ముప్పా సాయి, కృష్ణారెడ్డి, దండా సుమంత్ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **జలదంకి:** స్థానిక పిఎసిఎస్ బ్యాంకు ఆవరణలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి కావలి డిఎల్‌సిఓ కె తిరుపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బ్యాంకు ఆవరణలో పలురకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు నాగగాయత్రి, పిఐసి మస్తానమ్మ, ఆడిటర్ రమేష్, సొసైటీ సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

●**వలేటివారిపాలెం :** నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని వలేటివారిపాలెం, చుండి, పోకూరు, కాకర్లవారిపాలెం తదితర గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రహదారుల వెంబడి అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్, చుండి మోడల్‌స్కూల్ పిన్స్‌పాల్ వెంకటేశ్వర్, ఈఓఆర్డీ రమేష్‌బాబు, ఏపిఓ దయాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన వైసీపీ నేతలు



కావలి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన దగదర్తి వైసీపీ నేతలు

కావలి, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): దగదర్తి మండల వైసీపీ నాయకులైన జలదంకి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, జడ్పీటీసీ తాళ్ళూరు స్వరూపరాణి, కొంత మంది ఎంపీటీసీలు ముఖ్యమంత్రి నా రా చంద్రబాబునాయుడిని, జి ల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూ క్‌ను బుధవారం రాత్రి తాడేపల్లి లోని సచివాలయంలో కలి సారు. కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారు టీడీపీలో చేరడంలో భాగంగానే వారిని కలిసినట్లు రాజకీయ పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వలేటివారిపాలెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి 7,8,9, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. ఎంపీసీ, బైపీసీ, సీఇసి కోర్సులకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓసీ, బీసీలకు రూ. 200, ఎస్సీ, ఎస్టీలకు రూ. 150 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో ఈనెల 6వ తేదీ నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

●**ఉలవపాడు :** మండలంలోని వీరేపల్లి ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులకు విద్యాశాఖ కమిషన్ మరో అవకాశం కల్పించిందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 20 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు. అదేవిధంగా 7,8,9 తర గతుల్లో ఈ విద్యాసంవత్సరం ఏర్పడిన ఖాళీల భర్తీకి కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

● **కందుకూరు :** మండలంలోని జీ. మేకపాడులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు అవకాశం కల్పిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేసినందున విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ యు దాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంతో పాటు 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

● **కొండాపురం :** ఆదర్శ పాఠశాలల్లో 6 నుండి 9వ తరగతితోపాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మిగిలిపోయిన సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ షేక్ ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈనెల 20వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. గతంలో ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు ఈనెల 24వ తేదీన పాఠశాల స్థాయిలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించకోవాలని ఈసందర్భంగా ఆయన కోరారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్మా పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనురాధ

ఉలవపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం, రాజుపాలెం గ్రామాల్లో కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాదుబాబు అధ్యక్షతన గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మామిడి, సపోటా, మిరప, వరి ప్రధాన సాగు చేస్తున్నందున వాటి సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం మామిడి పంట కోత దశలో ఉన్నందున రైతులు పండు ఈగ బెడద నుంచి కాపాడుకునేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. కందుకూరు నిర్మా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం అనురాధ మాట్లాడుతూ డ్రోన్ దీదీ అనే కేంద్ర ప్రభుత్వ పథకం కింద స్వయం సహాయక సంఘం మహిళలు 80 శాతం సబ్సిడీతో డ్రోన్ తీసుకొని అద్దెకు పిచికారి చేసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందొచ్చన్నారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై తయారుచేసిన పుస్తకాలను రైతులకు అందించారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆత్మా బీటీయం కృష్ణ, రైతు సేవా కేంద్రం ఉద్యాన సహాయకులు యోగేష్, వెంకట్రావు, సుచరిత, రైతులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు..



మురుగునీటి మయంగా ఉన్న రోడ్డు

కావలి, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): కావలి పట్టణ నడి బొడ్డున ఆర్వోబీ పక్కన ఉన్న ప్రధాన చర్చి రోడ్డుకు మోక్షమెప్పుడని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ట్రంకు రోడ్డు నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో పట్టణంలోకి వెళ్లే ప్రధాన పైపు లైన్‌ను ఆ రోడ్డు కింద వేశారు. దీంతో ఆపైపులైన్ తరచూ దెబ్బ తింటుండటంతో రోడ్డును పగుల కొటట్టం పరిపాటైంది. 12 రోజుల వ్యవధిలో ఇటీవల రెండు పర్యాయాలు పైపులైన్ పగలటంతో రోడ్డును తవ్వి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. గుంట పూడ్చకుండా వదిలి వేయటంతో దానిలో పక్కనే ఉన్న మురుగు కాలువ నీరు చేరింది. గతంలో నాసిరకం పైపులు వేయటంతో తరచూ పగిలిపోతున్నందున మరమ్మతులు చేయడం మానేశారు. నాసిరకం పైపులైన్ తొలగించి దాని స్థానంలో ఐరన్ పైపులైన్ వేసే వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు అవకాశాలు లేవని అధికారులు చెపుతున్నారు. ప్రధానంగా ఐడీఎస్ఎంటీ ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి ట్రంకు రోడ్డులోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు ఉన్న ప్రధాన పైపులైన్ దెబ్బతింది. దానిని తొలగించి దాని స్థానంలో ఐరన్ పైపులైన్ వేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారే కాని నిధులు మంజూరై అది ఆచరణకు నోచుకోలేదు.

మురుగు నీటి పారుదలకు ఆటంకం

అలాగే పైపులైన్ పక్కనే ఉన్న ప్రధాన డ్రైనేజీ కూడా తరచూ మురుగు నీటి పారుదలకు ఆటంకం కలుగుతోంది. అయితే పైపులైన్ సమస్య శాశ్వతంగా పరిష్కారమైతే కాని ఆ డ్రైన్ నిర్మాణం చేట్టలేమని అధికారులు చెపుతున్నారు. ప్రధాన పైపులైన్ దెబ్బతిని ఉండటంతో దాని వలన తాగునీటి ఇబ్బందులతో పాటు ఆ మార్గంలో రాకపోకలకు ఆటంకం కలగటమే కాక డ్రైనేజీ సమస్య కూడా ఉత్పన్నమవుతోంది. ఒక్క పైపులైన్‌తో ఇన్ని సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నా అధికారులు స్పందించటంలేదని, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చొరవ తీసుకుని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయుష్షును పెంచే ఆయుధం యోగా



యోగాసనాలు వేస్తున్న అధికారులు, విద్యార్థులు

అల్లూరు, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): యోగా అనేది మానవుని ఆయుష్షును పెంచే ఆయుధమని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా అల్లూరు రామకృష్ణ డిగ్రీ కళాశాలలో గురువారం యోగాంధ్రపై అవగాహన కల్పించడంతోపాటు ఆసనాలను వేశారు. ఈ సందర్భంగా యోగా గురువు మల్లికార్జున విద్యార్థులతో ఆసనాలను వేయించి విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కొప్పు శ్రీనివాసులు, శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ పనుల పూర్తికి చర్యలు

● హాజరత్తయ్య, ఇరిగేషన్ డీఈ

ముఖాముఖి

కందుకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకోనున్నట్లు కందుకూరు ఇరిగేషన్ డీఈ హజరత్తయ్య తెలిపారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను పూర్తిచేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు ఆయన తెలిపారు.

? సబ్ డివిజన్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఇప్పటికైనా దృష్టిసారిస్తారా.

! ఇరిగేషన్ డిపార్టుమెంటులో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయించాలన్న లక్ష్యంతో ఉన్నాం. ఆదిశగా ప్రణాళికలు కూడా సిద్ధం చేశాం.

? రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మోపాడు సప్లైఛానల్ పరిస్థితి ఏమిటి.

! గత 22 సంవత్సరాలుగా మోపాడు సప్లైచానల్ పనులు కొనసాగుతున్న విషయం వాస్తవం. మరో 3 కోట్ల రూపాయల మేర పనులు పెండింగ్ ఉన్నాయి. త్వరలోనే పనులు ప్రారంభించి, ఈ ఏడాది పూర్తిచేయిస్తాం.

? మిగిలిన అసంపూర్తి పనుల పరిస్థితి ఏమిటి.

! పోకూరు చెరువు మరమ్మతులను త్వరలోనే ప్రారంభించి పూర్తిచేయిస్తాం. అలాగే ఎల్‌యూ సప్లై ఛానల్ పరిధిలో బద్దిపూడి చెరువు, కాలువ మరమ్మతులు పెండింగ్ ఉన్నాయి. వాటిని కూడా త్వరితగతిన ప్రారంభించటానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వ పాఠశాలలో వంట గది ప్రారంభం



నూతనంగా నిర్మించిన వంటగదిని ప్రారంభిస్తున్న ఎంఈఓ నాగేశ్వరరావు

జలదంకి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు విజయవాడలో స్థిరపడ్డ లింగరాజు అగ్రహారానికి చెందిన కంచర్ల కొండపనాయుడు రూ.4లక్షలతో తన తల్లిదండ్రులు కంచర్ల వెంకయ్య, రావమ్మల జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలలో వంట గదిని నిర్మించారు. నూతనంగా నిర్మించిన వంటగదిని గురువారం ఎంఈఓ సిహెచ్ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వంటగది నిర్మాణ దాత కంచర్ల కొండపనాయుడు దంపతులు, ఎండిఓ ఎస్ మహేశ్వరి, సర్పంచ్ మంగళి తిరుమల, ట్రస్ట్ సభ్యులు గాలి శ్రీనివాసులు, గ్రామస్థులు కంచర్ల మాల్యాద్రినాయుడు, కొండపనాయుడు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

కావలి రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుఠపురం 1వ లైన్‌లో ఓ పిచ్చికుక్క కనిపించిన వారిని కరుస్తుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. బుధ, గురువారాలలో సుమారు 10 మందిని కరవడంతో బెంబేలెత్తు తున్నారు. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జనతాపేట నార్తులో రాత్రి పూట వీధి కుక్కలు వాహనాలను వెంబడిస్తున్నాయని, మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి కాపాడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అవినీతి అక్రమాలపై బహిరంగ చర్చ ఏమైంది?

కావలిటౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని పదే పదే ప్రగల్భాలు పగిలిన ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఎందుకు బహిరంగ చర్చకు సిద్ధం కావడం లేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం ముసునూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూఅమృత్ పథకంలో తాను కాంట్రాక్టర్ నుంచి 13 కోట్ల రూపాయలు కమీషన్ తీసుకున్నట్లు ఎమ్మెల్యే చేసిన ఆరోపణల్లో పస లేదన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు : 99890 59755

తుడా.. అక్రమాల్లో బడా!



ప్రాథమిక విచారణ పూర్తి

రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందించనున్న విజిలెన్స్

బాధ్యులందరికీ నోటీసులు జారీ

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

వైసీపీ హయాంలో తుడాలో నిధుల దుర్వినియోగం భారీగా జరిగిందా? అయినవారికి పప్పుబెల్లాల్లా పంచేశారా? దీని ఫలితమే నిధులన్నీ ఊడ్చేయడమా? ఈ ప్రశ్నలన్నింటికి విజిలెన్స్ విచారణలో ఔననే సమాధానాలు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. 12 అంశాలపై ప్రాథమిక విచారణ పూర్తి చేశారు. భారీగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారని తెలిసింది. ఈ మేరకు 'లెక్క'లతో నివేదిక సిద్ధంచేశారని, రెండు రోజుల్లో ప్రభుత్వానికి అందించనున్నారని తెలిసింది.

● తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు కూర్చోవడానికి పది వేల బెంచీలు ఏర్పాటు చేశారు. ఒక్కో బెంచీని రూ.8 వేల చొప్పున కొనుగోలు చేసినట్లు బిల్లులు పెట్టారు. అయితే, మార్కెట్లో దీని విలువ గరిష్ఠంగా రూ.3 వేల నుంచి రూ.3500 వరకు ఉంటుందని విజిలెన్సు అధికారులు గుర్తించారు. ఇలా దాదాపు రూ 4.50 కోట్లు దుర్వినియోగమైనట్లు విచారణలో బయటకు వచ్చింది.

● తుడాలో వివిధ రకాల క్యాడర్లలో 30 మందిని నియమించుకున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.20 వేల నుంచి రూ30 వేల వరకు గౌరవ వేతనం చెల్లించారు. ఇలా ఐదేళ్లలో దాదాపు రూ.5 కోట్లు జీతాల రూపంలో చెల్లించినట్లు తెలిసింది. ఇందులోనూ నిధులు పక్కదారి పట్టినట్లు తెలిసింది.

● తుమ్మలగుంట చెరువు అభివృద్ధికని దాదాపు రూ.60 కోట్లు మంజూరు చేశారు. అందులోనూ భారీ ఎత్తున నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించారని సమాచారం.

● ఎన్నికలకు ముందు చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ఆరుగురు ఎంపీడీవోలకు అభివృద్ధి పనులకని నిధులు మంజూరు చేశారు. తిరుపతి రూరల్ ఎంపీడీవోకు రూ.100 కోట్లు, చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు మండలాలకు రూ.35 కోట్లు చొప్పున.. ఎర్రావారిపాలెం, పాకాల మండలాలకు రూ.30 కోట్లు వంతున విడుదల చేశారు. ఈ నిధులు ఎంపీడీవోల ఖాతాల్లో డిపాజిట్ చేయడం చట్ట విరుద్ధమని విజిలెన్సు తేల్చింది. దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం నుంచి క్లారిఫికేషన్ తీసుకున్నట్లు తెలిసింది.

● ఇంటింటికీ రెండు పండ్ల మొక్కలు, రెండు సాధారణ మొక్కలు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల మొక్కలు పంపిణీ చేయకనే సొంతంగా ఇళ్ల ముందు నాటుకున్న మొక్కలనూ చూపించి తుడా నిధులు స్వాహా చేశారని విచారణలో తేలినట్లు సమాచారం.

● అప్పట్లో తుడాకు సంబంధించి రూ.కోట్ల పనుల టెండర్లను ఒక కంపెనీకి కట్టబెట్టడం వెనుక పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా భారీ స్థాయిలో నాలుగు పనులకు గాను రూ.40 కోట్లు విడుదల చేశారు. దీనిపైనా విజిలెన్సు అధికారులు లోతుగా విచారించారని తెలిసింది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రూ.300 కోట్లకుపైగా నిధులు దుర్వినియోగమైనట్లు విచారణలో తేలిందని విశ్వసనీయ సమాచారం. ఇవన్నీ పూర్తయిన తర్వాత క్షేత్ర స్థాయి పర్యటనకు అధికారులు సిద్ధం అవుతున్నారు.

తుడాకు ప్రభుత్వం కేటాయించిన వాహనాలు కాకుండా అదనంగా ఆరేడు వాహనాలను అద్దెకు తీసుకున్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. ఇందుకు గాను నెలకు రూ.4 లక్షలు వెచ్చించినట్లు లెక్కలు చూపారు. ఇలా దాదాపు రూ 1.82 కోట్లు దుర్వినియోగం చేసినట్లు విమర్శలున్నాయి.

మరి కొన్ని గంటల్లో కుమార్తె పెళ్లి

● అంతలోనే ఆగిన తండ్రి గుండె ● ఏఎస్ఐ ఇంట తీవ్ర విషాదం



సాంబయ్య, ఏఎస్ఐ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మాట, వినికిడిలేని ఆడబిడ్డను అల్లారుముద్దుగా చూసుకున్నారు. ఆమె వివాహం చేసి తన బాధ్యతను నెరవేర్చుకోవాలని కలలు కన్నారు. ఆ కల్యాణ ఘడియ రానే వచ్చింది. మరికొన్ని గంటల్లో ఇంటి నుంచి తన కుమార్తెను వివాహ మండపానికి తీసుకెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో ఆ తండ్రి గుండె ఆగింది. పెళ్లి సందడితో కళకళలాడిన ఆ ఇల్లు శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.కేవీబీపురం మండలం కోవనూరుకు చెందిన సాంబయ్య తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈయన భార్య గృహిణి. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తెకు చిన్నపటి నుంచి మాట, వినికిడిలోపం ఉంది. ఇటీవల రాజీవ్ నగర్‌కు చెందిన ఓ యువకుడితో ఆమెకు వివాహం నిశ్చయించారు. కూతురిపెళ్లికోసం కొద్ది రోజులుగా ఏఎస్ఐ సాంబయ్య విధులకు సెలవు పపెట్టారు. శ్రీకాళహస్తి మండలం రామాపురం రిజర్వాయర్ వద్ద కైలాసగిరిప్రదక్షిణ సాగే మార్గంలోని శివపార్వతుల విడిది మండపంలో గురువారం రాత్రి పెళ్లి జరగాల్సి ఉంది. ఇందుకోసం బంధువులు ఉదయం నుంచే మండపం వద్ద అవసరమైన పనులు చేపట్టారు. పెళ్లి సామగ్రి కోనుగోలు కోసం సాంబయ్య గురువారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చారు. ఆటోలో సామాన్లను వేసుకుని, వెనుక ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని బంగారమ్మ కాలనీ వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతూ స్పీడ్‌బ్రేకర్ వద్ద వాహనాన్ని స్లో చేశారు. అక్కడే ద్విచక్రవాహనంపై నుంచి ఒక వైపు ఒరిగిపోయారు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు ధ్రువీకరించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాసేపట్లో జరగబోయే కూతురి పెళ్లి ఆనందంలో ఉన్న ఆ తండ్రి.. ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో బంధువులు గుండెలు బాదుకుంటూ విలపించారు.

డ్రగ్స్ కేసులో రిజర్వు హెడ్ కానిస్టేబుల్ విధుల నుంచి తొలగింపు

● ఉద్యోగుల చిట్టా బయటకు తీస్తున్న అధికారులు


తిరుపతి(నేరవిభాగం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో డ్రగ్స్ కేసులో అరెస్టయిన తిరుపతి రిజర్వు హెడ్ కానిస్టేబుల్ పూజారి రామచంద్రను విధుల నుంచి తొలగిస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను కొంత కాలంగా మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నవారితో చేతులు కలిపి పెద్ద ఎత్తున అక్రమ సంపాదన చేసినట్లు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారంపై ఆ శాఖ రిజర్వు విభాగం అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటికే డ్రగ్స్ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న రిజర్వు కానిస్టేబుల్ గుణశేఖర్‌ను విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఇదే కేసులో గతంలో అరెస్టయిన సురేంద్రరెడ్డికి, కేవీపల్లెకు చెందిన ఈశ్వర రెడ్డి అత్యంత సన్నిహితుడిగా పేరుంది. ఇతడినీ హైదరాబాదులో అరెస్టు చేశారు. ఈ కేసులో ఇద్దరు రిజర్వు పోలీసులతో పాటు మరో ఇద్దరు జిల్లాకు చెందిన వారు అరెస్టు కావడం గమనార్హం. చాపకింద నీరులా సాగుతున్న డ్రగ్స్ వ్యాపారంలో ఇద్దరు రిజర్వు పోలీసులు ఉండటం పోలీసు శాఖలో కలకలం రేపింది. ఇంకా ఈ విభాగంలో ఎవరికైనా గుణశేఖర్‌తో సంబంధాలు వున్నాయా అనే కోణంలో అధికారులు విచారిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రిజర్వు విభాగంలో పనిచేస్తున్న మరో కానిస్టేబుల్‌తో పాటు డీపీఓలో పనిచేస్తున్న సిబ్బంది ఒకరికి రామచంద్రతో సత్సంబంధాలు వున్నట్లు తెలిసింది. అలాగే, ఆ విభాగంలో పనిచేస్తున్న అన్ని స్థాయిల అధికారులు, కింది స్థాయి సిబ్బంది చరిత్ర బయటకు తీసే పనిలో పడ్డారు. గతంలో ఎవరెవరు.. ఎక్కడ.. ఎన్ని సంవత్సరాలు పని చేశారు? అక్కడ వారికి నేర చరిత్ర ఏమైనా వుందా? పనితీరు ఎలా వుంది? నేతలతో ఎవరికి సంబంధాలు ఉన్నాయనే దిశగా ఆరా తీస్తున్నారు.

తిరుపతి రిజర్వు డీఎస్పీ రవీంద్రా రెడ్డి బదిలీ

● పర్యవేక్షణ లోపమే కారణమా?



తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా రిజర్వు విభాగంలో దీర్ఘకాలంగా ఉన్న డీఎస్పీ రవీంద్రా రెడ్డి బదిలీ అయ్యారు. హైదరాబాదు డ్రగ్స్ కేసులో అరెస్టయిన వారిలో తిరుపతి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, కానిస్టేబుల్ గుణశేఖర్ ఉన్నారు. మత్తు పదార్థాలు సరఫరాచేసే స్థాయికి వీరు వెళ్లినా ముందుగా పసికట్టి అరికట్టే పరిస్థితి లేకపోవడంతో జిల్లా రిజర్వు విభాగానికి మాయని మచ్చగా తయారైంది. డ్రగ్స్ మూలాలు తిరుపతి జిల్లా రిజర్వు విభాగంలో వున్నప్పటికీ పట్టించుకోక పోవడంతో డీఎస్పీ రవీంద్రారెడ్డిని బాధ్యుడిని చేసి బదిలీ చేసినట్లు సమాచారం.



మొక్క నాటుతున్న డీన్ వీరబ్రహ్మయ్య, ఏడీ జగపతిరామయ్య తదితరులు

అమ్మకోసం ఒకచెట్టు

తిరుపతిరూరల్, జూన్5(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలలో గురువారం 'అమ్మకోసం ఒక చెట్టు' పేరిట విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లులను ఆహ్వానించి.. వారితో కలిసి అమ్మకోసం ఒక చెట్టు పేరుతో (ఏక్ పెడ్ మాకే నామ్, మాకేసాత్, మాకేహాత్) మొక్కలు నాటారు. పిల్లలతో కలసి తమ పేరుపై కళాశాలలో మొక్కను నాటడం చాలా సంతోషంగా ఉందని తల్లులు పేర్కొన్నారు.దీన్ని సంరక్షించే బాధ్యతను కూడా చేపట్టాలని వారు ఆకాంక్షించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి మాతృభూమి కోసం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ జగపతిరామయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ లేని భవిష్యత్ కోసం కృషి చేయాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ క్రాంతి, డాక్టర్ చైతన్య, డాక్టర్ శ్వేత, డాక్టర్ తేజ తదితరులు పాల్గొన్నారు.


మెగా డీఎస్సీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 5(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలో శుక్రవారం నుంచి మెగా డీఎస్సీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఎస్సీ పరీక్షలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల కోసం జిల్లాలో 8 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. లోపాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. 33.607మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్సులో జరుగుతాయని, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు, జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్, అదనపు డీఎస్సీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో బాలాజీనాయక్, అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీకి పటిష్ఠ భద్రత

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 8 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

నూతన ఆర్ఐఓగా రాజశేఖరరెడ్డి



తిరుపతి(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యామండలి తిరుపతి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ)గా ఎ.రాజశేఖరరెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఆర్ఐఓగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి స్థానంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న రాజశేఖర్‌ను నియమిస్తూ ఇంటర్ విద్యామండలి ఉత్తర్వులు వెలువరించింది. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలలు ఇంటర్ బోర్డు విధి విధానాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రవేశాలు, కళాశాలల్లో వసతి సౌకర్యాలు బోర్డు నియామవాళి ప్రకారం ఉండాలని చెప్పారు. అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. అన్ని యాజమాన్య కళాశాలల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు.

9 నుంచి శ్రీవారి ఆలయంలో జ్యేష్టాభిషేకం

తిరుమల, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు సాలకట్ల జ్యేష్టాభిషేకం జరగనుంది. శ్రీవారి ఆలయం సంపంగి ప్రదక్షిణ ప్రాకారంలోని కల్యాణమండపంలో నిర్వహించే ఈ క్రతువును 'అభిద్యేయక అభిషేకం' అని కూడా అంటారు. తరతరాలుగా అభిషేకాలతో అత్యంత ప్రాచీనమైన స్వామివారి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షించేందుకు ఈ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. మొదటిరోజు శ్రీమలయప్ప స్వామికి ఉండే బంగారు కవచాన్ని తొలగించి హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ తర్వాత స్వామికివారికి వజ్రకవచాన్ని అలంకరించి సాయంత్రం ఊరేగిస్తారు. ఇక రెండవరోజు ముత్యాల కవచం సమర్పిస్తారు. చివరిరోజు తిరుమంజనాదులు పూర్తిచేసి తిరిగి బంగారు కవచాన్ని సమర్పిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్టాభిషేకంలోనే తీస్తారు. అంతవరకు ఏడాది పొడవునా శ్రీవారు బంగారు కవచంతోనే వివిధ ఉత్సవాల్లో పాల్గొంటారు.

తిరుమలకు మెరుగైన భద్రత

● టీటీడీ నూతన సీవీఎస్వో మురళీకృష్ణ



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గతంలో డీఎస్పీగా, అదనపు ఎస్పీగా పనిచేసిన అనుభవాన్ని ఉపయోగించుకుని భక్తులకు, తిరుమల క్షేత్రానికి మెరుగైన భద్రతను కల్పించేలా విధులు నిర్వహిస్తానని టీటీడీ నూతన సీవీఎస్వోగా కేవీ మురళీకృష్ణ తెలిపారు. తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల టీటీడీ తీసుకున్న నిర్ణయాలను అర్థం చేసుకుని భద్రత పెంపుకోసం చర్యలు తీసుకుంటామన్నారు. టెక్నాలజీని కూడా వినియోగించుకుని ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఇంత బాధ్యతాయుతమైన ఉద్యోగాన్ని నిర్వర్తించేందుకు అవకాశం కల్పించిన స్వామివారితో పాటు సీఎం, డిప్యూటీసీఎం, సీఎస్, డీజీపీకి ధన్యవాదాలు తెలిపారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, జూన్5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,288

తలనీలాలు సమర్పించినవారు: 32,079



అమ్మ ముఖంలో ఆనందం



బయటి నుంచి కొనుగోలు చేసిన బేబీ బెడ్స్‌లో పురిటి బిడ్డలను ఆస్పత్రి నుంచి తీసుకువెళుతున్న తల్లులు

పంపిణీకి సిద్ధం చేస్తున్న బేబీ కిట్లు



పసికందుల సంరక్షణకు ప్రభుత్వం శ్రీకారం

ఎన్టీఆర్ బేబీ కిట్ల పునరుద్ధరణకు ఏర్పాట్లు

ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలనే నిర్ణయం పేదతల్లుల్లో ఆనందాన్ని నింపనుంది. ప్రసవానికి ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారిలో ఎక్కువమంది పేదవారే. ప్రసవానంతరం రూ.500 ఖర్చు పెట్టి పసికందును తీసుకువెళ్లలేని దైన్యస్థితిని ఎదుర్కొనేవారే. ఈ పరిస్థితిని గుర్తించిన టీడీపీ ప్రభుత్వం గతంలో ఎన్టీఆర్ బేబీ కిట్లను ఉచితంగా అందించేది. ఈ బేబీ కిట్ విలువ కనీసం రూ.1,500 వరకు ఉండేది. ఇందులో బేబీ టవల్, బెడ్ , లిక్విడ్ సోప్ , దోమ తెర ఉండేవి. పురిటి బిడ్డల సంరక్షణకు ఇవి ఉపయోగపడేవి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకూ పరోక్షంగా దోహదపడేది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఆ ఐదేళ్లూ కిట్లు ఇస్తే ఒట్టు

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ పథకం పేరు మార్చింది గానీ కిట్లను మాత్రం అందించలేకపోయింది ఏడాదిలోనే పూర్తిగా స్వస్తి పలికేసింది. దీంతో ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకున్న తల్లులు ఇబ్బందిపడేవారు. ప్రసవానంతరం కొందరు పాత దుప్పట్లను ఉపయోగించే వారు. దీనివలన పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడే అవకాశాలుండేవి. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 102 పీహెచ్‌సీలు, 16 సీహెచ్‌సీలు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, రెండు జిల్లా ఆస్పత్రుల పరిధిలో ఏటా 40 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోనే ఏటా దాదాపు 20 వేలకు పైగా ప్రసవాలు జరుగుతాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఎన్టీఆర్ బేబీ కిట్లకు ఏటా రూ.6 కోట్లను ఖర్చు చేయనుంది. ఈదిశగా ఇప్పటికే చర్యలను వేగవంతం చేసింది. త్వరలోనే బేబీకిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తిరుపతి ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి తెలిపారు.

స్టూడెంట్ కిట్స్ గతంకంటే నాణ్యంగా ఉన్నాయి

కిట్స్ స్టాక్ పాయింట్లను పరిశీలించిన రాష్ట్ర పరిశీలకురాలు అనురాధ



బ్యాగ్స్ నాణ్యతను పరిశీలిస్తున్న అనురాధ

తిరుపతి(విద్య), జూన్ 5(ఆంధ్రజ్యోతి): స్టూడెంట్ కిట్స్ గత ఏడాదికంటే నాణ్యంగా ఉన్నాయని రాష్ట్ర పరిశీలకులు, అమరావతి సమగ్ర శిక్ష డిప్యూటీ డైరెక్టర్ అనురాధ పేర్కొన్నారు. గురువారం ఆమె చంద్రగిరి, రేణిగుంట, తిరుపతి రూరల్, అర్బన్, ఏర్పేడు ప్రాంతాల్లోని స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్లను పరిశీలించారు. టెక్స్, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, బ్యాగ్, బెల్ట్, షూస్, మూడు జతల యూనిఫాం క్లాత్ నాణ్యతను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ షూలు, యూనిఫాం తప్ప మిగిలిన అన్ని వస్తువులు ఇప్పటికే పాఠశాలలకు చేరాయని చెప్పారు. అనంతరం తిరుపతి అర్బన్ మండలంలో జరుగుతున్న సీసీహెచ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సురేష్, మండల విద్యాశాఖ అధికారులు, సీఆర్పీలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం ఎంపీడీవోకు పదోన్నతి

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎంపీడీవో బి.ఇందిరమ్మకు ప్రభుత్వం డీఎల్‌డీవో (డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా పదోన్నతి కల్పించింది. వాస్తవానికి ఆమెకు 2021-22లోనే ఈ పదోన్నతి లభించింది. అయితే ఇందిరమ్మతో సహా రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు ఎంపీడీవోలకు అప్పట్లో డీఎల్‌డీవో పోస్టులు ఇవ్వకుండా ప్రభుత్వం పెండింగులో ఉంచింది. ఈ ముగ్గురిపై శాఖాపరమైన విచారణ పెండింగులో ఉండడం వల్ల ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే తదుపరి విచారణలో ఈ ముగ్గురిపై వచ్చిన ఆరోపణలు నిరూపణ కాకపోవడంతో పదోన్నతికి అడ్డంకులు తొలగిపోయాయి. ఆ క్రమంలో ప్రభుత్వం ఇందిరమ్మ సహా ముగ్గురికీ డీఎల్‌డీవోగా పదోన్నతి కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పదోన్నతి తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. పోస్టింగ్ కోసం పీఆర్ శాఖ ముఖ్య కార్యదర్శికి రిపోర్టు చేయాలని ఆదేశించింది.

కల్పవృక్షంపై గోవిందుడి విహారం





తిరుపతిఅర్బన్, జూన్5(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా..భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం 10-11గంటల వరకు స్వామి. అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. రాత్రి 7-9గంటల వరకు సర్వభూపాల వాహనంపై స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. కాగా శుక్రవారం రాత్రి 7-10గంటల వరకు స్వామివారి గరుడ సేవ జరగనుంది.

రేపటి నుంచి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు



అమ్మవారి పుష్కరణితో తెప్పలను ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

తిరుచానూరు అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు శనివారం నుంచి ఐదు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. మొదటి రోజు శనివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండవ రోజు సుందరరాజస్వామి, మిగిలిన మూడు రోజుల పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారు. రాత్రి 7.30గంటలపై ఊరేగే ఉత్సవర్లు తిరుమాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. 10వ తేదీ రాత్రి 8.30గంటలకు అమ్మవారి గజవాహనసేవ, 11న అమ్మవారు గరుడ వాహనంపై ఊరేగి భక్తులకు అభయమివ్వనున్నారు. తెప్పత్సోవాలను పురస్కరించుకుని ఆలయంలో ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా తెప్పోత్సవాలను పురస్కరించుకుని పద్మసరోవరంలో ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

కొవిడ్ కట్టడిపై మాక్‌డ్రిల్



రుయాలో కొవిడ్ పరీక్ష చేస్తున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొవిడ్ కేసు నమోదు కావడంతో.. కట్టడికి ముందస్తు చర్యలు ఎలా చేపట్టాలనే అంశంపై అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో భాగంగా రుయాస్పత్రిలో సూపరింటెండెంట్ రాధ ఆధ్వర్యంలో ఈ మాక్‌డ్రిల్ జరిగింది. కొవిడ్ పరీక్షలు ఎలా నిర్వహించాలి? శాంపుల్స్ ఎలా సేకరించాలి? అవసరమైన మందులు ఎలా సిద్ధం చేసుకోవాలి? ఎలాంటి వైద్యం అందించాలి అనే అంశాలపై ఈ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక వైద్యులతో పలువురు సిబ్బందికి కొవిడ్ పరీక్షలు చేయించారు. కొవిడ్ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అన్నీ పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఏరియా, ప్రాంతీయ ఆస్పత్రుల్లోనూ డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు కోవిడ్ కట్టడిపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.

మిగులు భూములను పచ్చగా మారుద్దాం

● బైరాజుల కండ్రిగలో కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటిన ఎమ్మెల్యే



మొక్కలకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్

కేవీబీపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుసంధానం చేస్తూ మిగులు భూముల్లో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. కేవీబీపురం మండలం బైరాజులకండ్రిగ వద్ద డీఎఫ్‌వో విజయ్, ఎఫ్ఆర్వో సెల్వం, అటవీ సిబ్బంది గురువారం ఏర్పాటు చేసిన వనమహోత్సవంలో ఆయన కలెక్టర్‌తో కలిసి మొక్కలు నాటారు. రానున్న కాలంలో మండలం పెద్ద పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం గొప్పతనమని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధి పర్యావరణ కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి అటవీ సిబ్బంది, పరిసర గ్రామస్తులు ఈ ప్రాంతంలో వెయ్యి మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో సుమారు 5లక్షల మొక్కలు నాటి బతికించాలని కోరారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డితో కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిప్రదక్షిణకు సమీపంలోని ఈ ప్రాంతాన్ని, రెండున్నర కిలోమీటర్ల రోడ్డును ఎన్ఆర్‌డీఎస్ ద్వారా నిధులు వెచ్చించి అనుసంధానం చేయాలని సూచించారు. జిల్లా పర్యావరణంలో పచ్చదనంలో రెండవ స్థానంలో ఉందన్నారు. ఇకపై మండల స్థాయిలో నర్సరీలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తుందని, అవసరమైన మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, వెంకటగిరి ఎఫ్ఆర్వో శివశంకర్‌రెడ్డి, ఎంపీడీవో మాలతి, ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్, ఆర్ఐ కరుణాకర్, అటవీ, రెవెన్యూ సిబ్బందితో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు, తిరుపతి పార్లమెంటరీ రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, సర్పంచులు విజయ్, ప్రకాష్‌యాదవ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి ఆన్‌లైన్‌లో స్థానికేతురాలి పేరు

● ఆలస్యంగా వెలుగులోకి..



గురవరాజుపల్లె వద్ద హైవేకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని శుభ్రం చేసిన దృశ్యం

రేణిగుంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రెవెన్యూ శాఖలో జరిగిన లీలలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రేణిగుంట మండలం గురవరాజుపల్లి తెలుగు గంగ రోడ్డులో అప్పటి పాత సర్వే నెంబర్ల ప్రకారం.. గురవరాజుపల్లి లెక్క దాఖల సర్వేనెంబర్ 99/3లో 4.01 ఎకరాలున్నాయి. విమానాశ్రయ పరిసరాల్లో భవిష్యత్తు అవసరాలకు జిల్లా రెవెన్యూ అధికారులు రిజర్వ్ చేసి ఉంచారు. 2018 వరకు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా ఉన్న ఇదే సర్వే నెంబర్‌ను 90/3 ఏగా మార్చి 3.02 ఎకరాలకు నళిని అనే మహిళ పేరిట రెవెన్యూ వెబ్ లాండ్‌లోకి ఎక్కించారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో మహిళ పేరు చూపుతున్న ఈ సర్వే నెంబర్‌పై తహసీల్దారు డిజిటల్ సంతకం చేయలేదు. అయినా కొంత మంది ఆ భూమిలోకి ప్రవేశించి శుభ్రం చేసినా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అసలు బయట ఊరికి చెందిన మహిళ పేరు వెబ్ లాండ్‌లోకి ఎవరు.. ఎలా.. ఏ హక్కుతో ఎక్కించారు? అనేదానిపై రెవెన్యూ అధికారులు విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై తహసీల్దారు సురేష్ బాబును వివరణ కోరగా.. ఇప్పటి వరకు ఈ విషయం తన దృష్టికి రాలేదని, వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తిరుమలలో పచ్చదనాన్ని 80 శాతానికి పెంచుతాం

తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో 70 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 80 శాతానికి పెంచేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరుమలలోని గోగర్భం డ్యాం వద్దనున్న ఆక్టోపస్ భవనం వద్ద గురువారం ఆయన మొక్కలు నాటారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో రెండు వేల మొక్కలు నాటుతున్నట్టు చెప్పారు. మొత్తం లక్ష మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టామని, ఇప్పటికే మొక్కల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. ఇప్పటికే ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నా.. పూర్తిగా ప్లాస్టిక్‌రహిత ప్రాంతంగా మార్చేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్లాస్టిక్ అనేది ఆరోగ్యానికి, పర్యావరణానికి పెద్ద శత్రువన్నారు. భక్తులు వాహనాల ద్వారా తీసుకువస్తున్న ప్లాస్టిక్‌ను కారు విండోల ద్వారా ఘాట్‌రోడ్లలో విసరడాన్ని గుర్తించామని, దీంతో అధికంగా ప్లాస్టిక్ పేరుకుపోతోందన్నారు. ఈక్రమంలోనే అలిపిరి చెక్‌పాయింట్ గట్టి తనిఖీలు చేయడంతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. భక్తులతో పాటు స్థానికంగా ఉండేవారు కూడా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. విదేశీ మొక్కలు నాటడం ద్వారా స్వదేశీ చెట్లకు హానీ కలుగుతోందన్నారు. అందులో భాగంగానే పూర్తిస్థాయిలో పరిశోధన చేసి 40 స్థానిక మొక్క జాతులను గుర్తించి నాటుతున్నామన్నారు. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసులు, డిప్యూటీఈవో సోమన్నారాయణ, ఈఈ సుధాకర్, డీఆర్వో, ఎఫ్ఆర్వోలు దొరస్వామి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న అదనపు ఈవో


కాళ్లు, చేతులు కట్టేసి.. మహిళ మెడలో నగల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దోపిడీ దొంగలు చెలరేగిపోతున్నారు. గిరిపురం కాలనీలో మహిళ కాళ్లు, చేతులు కట్టేసి మెడలో ఉన్న బంగారు నగలు అపహరించుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. గిరిపురం కాలనీకి చెందిన బాలచంద్ర గురువారం మధ్యాహ్నం తలుపులు తెరచి వాష్‌రూముకు వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు ఇంట్లోకి ప్రవేశించారు. ఆయన భార్య గిరిజతో మాటలు కలుపుతూ కొంతసేపటికి తాళ్లతో చేతులు, కాళ్లు కట్టేశారు. అరిస్తే చంపేస్తామని బెదిరించి మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. వాష్‌రూము నుంచి బయటకు వచ్చిన భర్తకు ఆమె జరిగిన విషయం చెప్పింది. వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మురళీమోహన్ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్దతు ధర ప్రకటనలకే పరిమితం

కొనుగోళ్లు ప్రారంభించని గుజ్జు పరిశ్రమలు

పాకాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో రైతులు సాగుచేసిన తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైంది. ఈ నెల5వ తేది చిత్తూరు, తిరుపతి కలెక్టర్లు, ఎమ్మెల్యేలు తోతాపురి మామిడికి ధర నిర్ణయించడంతో రైతులు సంతోషపడ్డారు. కోత కూలీలు, రవాణా ఖర్చులైనా దక్కుతాయనుకున్నారు. 5వ తేది నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని సంబరపడ్డారు. అయితే గురువారం కూడా గుజ్జుపరిశ్రమల కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. ఎప్పుడు కొనుగోళ్లు ప్రారంభిస్తారో కూడా తెలియని పరిస్థితి. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు తోటల్లో తోతాపురి కాయలు పక్వానికివచ్చి రాలిపోతున్నాయి. కాయలు కోసి మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు మండీల్లో, గుజ్జుపరిశ్రమల్లో కొనుగోలు చేయకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక ఇబ్బంది పడుతున్నారు. మండీ ర్యాంపులవద్ద టన్ను రూ.5వేలకు కొనేందుకు కూడా వ్యాపారులు మొగ్గు చూపడం లేదు.ఎందుకంటే మండీల్లో తోతాపురి అమ్ముడుపోక మగ్గుతున్నాయి.



కొనుగోళ్లు లేక మ్యాంగోనగర్ మండీల్లో మగ్గుతున్న తోతాపురి

వనసంరక్షణ సమితుల సృష్టికర్త చంద్రబాబు



యల్లశిరి వనసంరక్షణ సమితి ప్రతినిధులకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్, అటవీశాఖ అధికారులు

కోట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు వనసంరక్షణ సమితులను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు, అటవీశాఖ అధికారులు చిట్టేడులోని సునామి రక్షిత పరిశోధన కేంద్రంలో మొక్కలు నాటారు. అనంతరం కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉమ్మడి యాజమాన్య కార్యక్రమంలో భాగంగా వనసంరక్షణ సమితులకు 50శాతం షేర్ క్యాపిటల్ కింద రెండు కోట్ల ఆరులక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి దత్తత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జయ జయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్, అటవీశాఖ అధికారులు బీవీ రమణయ్య, గాయం శ్రీనివాసులు, ధనలక్ష్మి, టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, దశరధరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తీగల సురేష్‌బాబు, సురేష్, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, చిట్టమూరు, వాకాడు నాయకులు కిషోర్‌నాయుడు, రాజేష్‌రెడ్డి, మధురెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

సూళ్లూరుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో ప్లాస్టిక్ వినియోగం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తపాలా కార్యాలయం వద్ద రైల్వేస్టేషన్ రోడ్డులో మాజీ ఎమ్మెల్యే నెలవల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, చిట్టేటి పెరుమాల్, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెళ్లకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులతో కలసి టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు దొమ్మరాజు సత్యనారాయణ రాజు, మదన్‌మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, సుందరరామిరెడ్డి, గుంటపూడి రమణయ్య, కాండ్ర రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

చిట్టమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో మనోహర్ గౌడ్ కోరారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిట్టమూరు పీహెచ్‌సీ, డంపింగ్ యార్డ్, పోలీస్ స్టేషన్, మండలంలోని సచివాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్న బలరామయ్య, వైద్యాధికారిణి పద్మావతి, ఏపీవో షీలు, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఎఫ్‌ఏ నాగరాజు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో పర్యావరణ దినోత్సవం

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డీడీ మల్లికార్జున్ రెడ్డి, కోఆర్డినేటర్లు డాక్టర్ మాధవయ్య, విభాగాధిపతులు, విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. అదే విధంగా సిద్దవరంలో ఏఆర్‌డీ సంస్థ ప్రతినిధి రామాంజనేయులు ఆధ్వర్యంలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది మొక్కలు నాటి దత్తత తీసుకున్నారు.

గురుకులంలో సమస్యలను పరిష్కరించండి

చిల్లకూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, పూర్వ విద్యార్థులు కంటేపల్లి వెంకటేశ్వర్లు, సురేష్ గురువారం తిరుపతిలో డీసీవో గీతాకు విజ్ఞప్తి చేశారు. గురుకులంలోని ఆర్‌వో ప్లాంటు, తాగునీటి కొళాయిలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు శిథిలమైన ప్రహరీని తొలగించి కొత్తది నిర్మించాలని డీసీవోకు విన్నవించారు. ఆమెకు మొమెంటోను అందజేసి శాలువాతో సత్కరించారు.

పాఠశాలలో షార్ట్ సర్క్యూట్

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉత్తమనెల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం షార్ట్ సర్క్యూట్ జరిగింది. తరగతి గదిలోని ఫర్నిచర్, పుస్తకాలు దగ్ధమయ్యాయి. ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్టేట్ టాపర్ శివానీకి అభినందన

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచిన కోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని శివానీని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టీడీపీ నాయకులు, అధికారులు షీల్డ్‌లు, మొమెంటోలతో అభినందించారు. కేశవరం పంచాయతీలోని సిద్ధమ్మకండ్రిగ గ్రామానికి చెందిన శివానీ ఇంటర్ ఫలితాల్లో 978 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచి విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందుకుంది.

సమీర్‌కు ప్రతిభా అవార్డు



నాయుడుపేట, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): నాయుడుపేట విక్రమ్ కళాశాల విద్యార్థి షేక్ సమీర్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ జలదంకి విజయబాబురెడ్డి గురువారం తెలిపారు. సమీర్‌ను కళాశాల డైరెక్టర్లు కామిరెడ్డి సుబ్బారెడ్డి, ముత్యాల సంఘమిత్ర, అధ్యాపకులు అభినందించారు.

టీడీపీలో చేరిన 30 కుటుంబాలు

వాకాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం పంచాయతీ, బండ్లదిబ్బ, నేతకాయల ఊరు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు గుండాల శ్యామ్‌సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, దయాకర్, శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

వాకాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌ఏఎల్‌సీఎస్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్నాన భోజన నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రోగ్రామ్ అధికారి అమరావతి మాట్లాడుతూ పిల్లలకు రుచికరమైన, పౌష్టికాహారం అందించాలన్నారు. ఎంఈవో నసీంఅలీ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.



శిక్షణ ఇస్తున్న ప్రోగ్రామ్ ఆఫీసర్ అమరావతి

7 సవర్ల బంగారు నగల చోరీ

నాయుడుపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో 7 సవర్ల బంగారు నగలు, 60వేల నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు మాధవి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం ఉదయం కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసుకొని ఊరికి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి బీరువాలో ఉన్న 7 సవర్ల బంగారు నగలు, రూ.60వేల నగదు లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

వాకాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన శ్యామ్‌సుందర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.5.50 లక్షలు మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చెక్కు అందజేశారు.

వ్యాన్ ఢీకొని గురుకులం అటెండర్ దుర్మరణం



మృతి చెందిన నూర్‌షబ్‌జాన్

దొరవారిసత్రం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారిపై గురువారం రాత్రి టెంపో వ్యాన్ ఢీకొట్టడంతో గురుకులం అటెండర్ నూర్‌షబ్‌జాన్(54) దుర్మరణం చెందారు. దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న నూర్ షబ్‌జాన్ గురువారం రాత్రి రహదారి దాటుతుండగా, చెన్నై వైపు వెళ్లే టెంపో వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి వెంటనే వాహనాని అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.





కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ సీజేఎస్ భూములు - కబ్జా చేసేందుకు కంచె వేసిన ఆక్రమణదారులు

సీజేఎస్‌ఎఫ్ భూముల్లో పెద్దల పాగా!

కోట్ల విలువైన భూములు కొట్టేసేందుకు స్కెచ్ ● రాత్రికి రాత్రే యూకలిప్టస్ మొక్కలు నాటేస్తున్న ఆక్రమణదారులు

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కొట్టేసేందుకు పెద్దలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువచేసే సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములను పాత సర్వే స్కెచ్‌లతో ఆక్రమించుకుని రాత్రికి రాత్రే యూకలిప్టస్ మొక్కలు నాటేస్తున్నారు. కోట మండలం చెందోడు, గూడలి పంచాయతీ పరిధిలోకి చంద్రశేఖరపురం సమీపంలో ఉన్న సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములు ఉన్నాయి. గూడలి పంచాయతీ బిట్-2 పరిధిలోకి సర్వే నెంబరు 249-2, 291లో 3లో సుమారు 300 ఎకరాలకు పైగా సీజేఎస్ఎఫ్, డీకేటీ భూములు ఉన్నాయి. ఇందులో 1992లో జర్నలిస్టులకు, జోగిని వృత్తిని కొనసాగించే మాతమ్మలకు ఇంటి స్థలాలు ఇచ్చారు. అప్పట్లో అవి ఎందుకూ పనికిరాకుండా ఉండటంతో పట్టాలు పొందిన కొందరు భూములను వదిలేయగా, కొంతమంది సీజేఎఫ్ఎస్, డీకేటీ పట్టాదారులు భూస్వాములు, వ్యాపారవేత్తలకు కారుచౌకగా అమ్మేశారు. అప్పటి నుంచి ఆ భూముల్లోకి ఎవరూ ప్రవేశించకపోవడంతో బీళ్లుగా ఉంటూ వచ్చాయి. ప్రస్తుతం వీటి పక్కనే సాగరమాల సిక్స్ లేన్ రోడ్డు పనులు జరుతుండటంతో భూములకు విలువ పెరిగింది. గూడలి పరిధిలోని చంద్రశేఖరపురం చెరువు సమీపంలో సుమారు 80 ఎకరాలు సాగరమాల ఫ్లైఓవర్ సమీపంలో ఉన్నాయి. దీంతో ఈ భూములను సొంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నాలు మొదలెట్టారు. రాత్రికి రాత్రే కొంతమంది యూకలిప్టస్ చెట్లను నాటగా, కొంతమంది కంచె నిర్మించారు.

సీజేఎస్‌ఎఫ్ భూముల రికార్డులు తారుమారు

సీజేఎస్ఎఫ్ భూములను డీకేటీగా మార్చేందుకు 2018లో అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో గూడూరు, నాయుడుపేట, నెల్లూరుకు చెందిన కొంతమంది వ్యాపారస్థులతో పాటు కొంతమంది స్థానికులు నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించుకున్నట్లు సమాచారం. ఇందుకోసం అప్పట్లో పని చేసిన వీఆర్వోలు, సర్వేయర్లు ఎంజాయ్‌మెంట్ స్కెచ్ ఇచ్చి సహకరించినట్లు సమాచారం. ప్రస్తుత అధికారులు స్పందించి విచారణ జరిపితే అక్రమాలు విషయాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు జయజయరావు స్పందిస్తూ చంద్రశేఖరపురం సమీపంలో ఉన్న సీజేఎఫ్ఎస్, డీకేటీ భూములపై తక్షణం విచారణ చేపడుతామన్నారు.ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



చంద్రశేఖరపురం సమీపంలో నిర్మాణంలో ఉన్న సాగరమాల ఫ్లైఓవర్

దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది జగన్ తీరు: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, పక్కన టీడీపీ నేతలు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, మాధవనాయుడు

సూళ్లూరుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం సూళ్లూరుపేటలోని రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలసి నెలవల మీడియాతో మాట్లాడారు. ప్రజాధారణ కోల్పోయిన వైసీపీ ప్రజలు తీర్పు ఇచ్చిన రోజున వెన్నుపోటు దినం నిర్వహించడం దారుణమన్నారు. ప్రజాతీర్పును శంకిస్తే ఈ సారి సింగిల్ డిజిట్‌కే వైసీపీ పరిమితం కావడం ఖాయమన్నారు. రాజకీయ లబ్ధికోసం సొంత చిన్నానను గొడ్డలి పోటుతో చంపించిన జగన్ వెన్నుపోటు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కన్న తల్లికి, చెల్లికి, పార్టీ కార్యకర్తలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర జగన్‌దేనని విమర్శించారు. ఐదేళ్లలో వైసీపీ చేయని పనులను ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసి చూపించదన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, రహదారుల మరమ్మతులు, ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చిందని, ఈ నెలలో తల్లికి వందనం, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు చేస్తున్నా వైసీపీ విషం చిమ్మడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. యువ నాయకుడు లోకేశ్ విద్యారంగం ప్రత్యేక దృష్టి పెట్టి తొలిసారిగా మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లలో ఒక పరిశ్రమను నెలకొల్పకపోగా... ఉన్నవాటిని తరిమేశారని, డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ పేరిట అబద్ధపు మాటలు చెప్పి విధ్వంస పాలన సాగించిన జగన్‌కు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాల్, వాకచర్ల రమేష్, శ్రీనివాసులు, లోకేశ్ నాయుడు, బొమ్మన్ పళణి పాల్గొన్నారు.

తమ్ముడి మీద కోపంతో... అన్నపై హత్యాయత్నం



దాడిలో గాయపడిన అంకయ్య

నాయుడుపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తమ్ముడి మీద కోపంతో... అన్నను హత్య చేసేందుకు ప్రయత్నించారు. నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంలో నివాసం ఉంటున్న అంకయ్య కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తుంటాడు. అంకయ్య తమ్ముడు సురేష్ కొద్దిరోజుల క్రితం అదే గ్రామానికి చెందిన వివాహితను తీసుకొని వెళ్లిపోయాడు. దీంతో వివాహిత కుటుంబసభ్యులు అంకయ్య తమ్ముడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ్ముడి మీద కోపంతో అంకయ్య మీద పగ పెంచుకొని ఆయనను హతమార్చేందుకు వివాహిత కుటుంబసభ్యులు పథకం పన్నారు. బుధవారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న అంకయ్యతో మాట్లాడారు. అతని తమ్ముడితో పాటు మహిళ గ్రామ సమీపంలో ఉన్న స్వర్ణముఖినది వద్ద ఉన్నట్లు గుర్తించామని, మందలించి తీసుకువద్దామని నమ్మబలికారు. దీంతో అంకయ్య వారితో స్వర్ణముఖినది వద్దకు వెళ్లాడు. అక్కడే అందరూ కలిసి మద్యం తాగారు. అదే సమయంలో వివాహిత కుటుంబసభ్యులు అంకయ్య తలపై దాడి చేశారు. నిన్ను ఇక్కడే హత మారుస్తామని హెచ్చరించడంతో అంకయ్య అక్కడ నుంచి తప్పించుకొని గ్రామానికి చేరుకున్నాడు. జరిగిన సంఘటనను గ్రామస్తులకు వివరించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

కోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని విజయవాడకు చెందిన చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి కోరారు. కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. వంటల పోటీలు నిర్వహించారు. మంచి వంటలు తయారు చేసిన వారికి ఎంఈవో మస్తానయ్య చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

కరోనా కలకలం

- ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ
- ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో వెలుగులోకి..
- జిల్లావ్యాప్తంగా బాధితుల గుర్తింపు
- అందరూ హోం ఐసోలేషన్‌లోనే
- ప్రమాదం లేదంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మహమ్మారి కొవిడ్ మళ్లీ కలకలం రేపుతోంది. నెల్లూరు జిల్లాలో ఒకేసారి ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్య వర్గాలను కలవరపాటుకు గురిచేసింది. బాధితుల్లో ఒకరిది తిరుపతి జిల్లాలోని గూడూరు. మిగిలిన ఐదుగురూ నెల్లూరు జిల్లావాసులే. నగరంలోని ఇద్దరు నర్సింగ్ విద్యార్థులు కొవిడ్ బారిన పడ్డారు. వీరిలో ఓ విద్యార్థిని రెండు రోజుల క్రితం కేరళ నుంచి నెల్లూరుకు వచ్చింది. అలాగే భక్తవత్సల నగర్‌కు చెందిన 60 ఏళ్ల వ్యక్తికి కూడా కరోనా సోకినట్లు అధికారులు గుర్తించారు. వెంకటాచలం మండలం అనికేపల్లికి చెందిన ఓ యువకుడు, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన మరో యువకుడూ కరోనా బారిన పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆరుగురికి రెండు రోజుల క్రితం కరోనా ర్యాపిడ్ పరీక్ష చేశారు. ఇందులో పాజిటివ్‌గా వచ్చింది. దీంతో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా కరోనా నిర్ధారణ అయింది. వీరు జలుబు, జ్వరం, కీళ్ల నొప్పులతో వైద్యులను సంప్రదించటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

జీజీహెచ్‌లో 30 పడకలు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కరోనా బాధితులకు వైద్యసేవలు అందించేందుకు ఇప్పటికే 30 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువ అయితే జీజీహెచ్‌లో చికిత్స అందిస్తారు. ప్రస్తుతం నమోదైన కేసులు ప్రాథమిక స్థాయిలోనే ఉండటంతో బాధితులను హోం ఐసోలేషన్‌లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు.

ప్రాథమిక దశలోనే..

జిల్లాలో ఆరుగురికి కరోనా పరీక్షలు చేయగా అందరికీ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరంతా హోం ఐసోలేషన్‌లో ఉన్నారు. కరోనా తీవ్రత మాత్రం లేదు. ప్రాథమిక దశలోనే నిర్ధారణ అయింది.

\- డాక్టర్ సుజాత, డీఎంఅండ్‌హెచ్‌వో

జాగ్రత్తలు తీసుకోవాలి

కరోనా బాధితులతో అనుబంధంగా ఉన్న వారందరికీ పరీక్షలు చేశాం. చుట్టు పక్కల వారు జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్కులు, శానిటైజర్లు, పస్తుత బాధితులకు వచ్చిన కరోనా తక్కువ స్థాయిలో ఉండటంతో ఎలాంటి ప్రమాదం లేదు.

\- డాక్టర్ భాస్కర్, ఎపిడమాలజిస్ట్

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం గూడూరు పట్టణంలోని అశోక్‌నగర్ పార్కులో హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకుని మొక్కలు నాటి హరితాంధ్రప్రదేశ్‌కు తోడ్పాటునందించాలన్నారు. మొక్కలు నాటడం వల్ల సమృద్ధిగా ఆక్సిజన్ పొందడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించవచ్చునన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్‌రహీం, భారతి, పేటేటి చంద్రనీల్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగ పవన్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కోటేశ్వరరావు, అరవ పార్వతయ్య, మెహబూబ్‌బాషా, తాజుద్దీన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత



మొక్కలు నాటుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే వాతావరణ సమతుల్యత సాధ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణం అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, కమిషనర్ ఫజులుల్లా, మేనేజర్ ఉరుకుందమ్మ, ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ సమతుల్యతకు చెట్లు ఎంతగానో దోహదపడుతాయన్నారు. నియోజకవర్గంలో అవకాశం ఉన్న ప్రభుత్వ భూముల్లో విరివిగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నానాబాల సుబ్బారావు, మైలారి రాజశేఖర్, పొట్లపూడి రాజేష్, కరుణాకర్‌రెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని స్త్రీశక్తి భవనం వద్ద ఎంపీడీవో విజయలక్ష్మితో కలసి మండల నేతలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకుడు జనార్దన్, ఏపీవో చిన్నయ్య, ఏపీఎం పద్మ, సీహెచ్‌వో సుబ్బరామయ్య, టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, సీనియర్ నాయకులు బచ్చల రవీంద్రారెడ్డి, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నెల్లటూరు చిరంజీవి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో గిరిబాబు, పంచాయతీ కార్యదర్శి దివ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో గురువారం రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విష్ణువందన, డాక్టర్ రోహిణి, డాక్టర్ తనూజ, శశిరేఖ, జానా సుధీర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.